www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -209 సోమవారం16 నవంబర్ 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు 8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

నక్సలిజం కోరల్లో గిరిజన

సమాజం

మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో

ఓటు హక్కును కూడా కాలరాశారు

గత పాలకులు ఆదివాసీల

బాధలను పట్టించుకోలేదు

హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో

మారుతున్న పరిస్థితులు

బిర్సా ముండా 151వ జయంతి

సభలో ప్రధాని మోదీ వ్యాఖ్యలు

2లో



సాగునీటి ప్రాజెక్టులకు

చేయూతనివ్వండి

ప్రధాని మోదీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తులు

మూడు కీలక ప్రాజెక్టులకు

పర్యావరణ అనుమతులు త్వరగా

ఇవ్వండి

తుమ్మిడిహట్టి ఎత్తు 152 మీటర్లకు

పెంచేందుకు మహారాష్ట్రను ఒప్పించండి

సమ్మక్క-సారలమ్మ ప్రాజెక్టుకు

ఛత్తీస్‌గఢ్ నుంచి ఎన్‌వోసీ

ఇప్పించండి

భూగర్భ జలాల సంరక్షణకు రూ.5

వేల కోట్ల సాయం అందించండి



న్యూఢిల్లీ, నవంబర్ 15 (ప్రజావినికిడి): తెలంగాణ సాగునీటి రంగానికి సంబంధించి పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించి, రాష్ట్ర ప్రాజెక్టులకు కేంద్ర ప్రభుత్వం సహకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు. పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మసాగర్, డిండి ఎత్తిపోతల పథకాలకు అవసరమైన పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులను త్వరితగతిన మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అంతర్రాష్ట్ర ప్రాజెక్టుల విషయంలో నెలకొన్న అడ్డంకులను తొలగించేందుకు ప్రధాని చొరవ తీసుకోవాలని కోరారు. ఆదివారం ఢిల్లీలోని లోక్‌కల్యాణ్ మార్గ్-7లో ప్రధాని అధికారిక నివాసంలో నరేంద్ర మోదీతో

మిగతా2లో...



యువత పారిశ్రామికవేత్తలుగా

ఎదగాలి

యువత స్వయం ఉపాధిని ఎంచుకుని

పారిశ్రామికవేత్తలుగా రాణించాలి

ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

రంగారెడ్డి నవంబర్ 15 (ప్రజావినికిడి): యువత ఉద్యోగాల కోసం ఎదురుచూస్తూ సమయాన్ని వృథా చేసుకోకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకోవాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరికొందరికి ఉపాధి కల్పించే స్థాయికి చేరుకోవాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. యువతలోని ప్రతిభ,

మిగతా2లో...

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు



2లో

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు



2లో

సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

రక్షణ రంగంలో స్వావలంబన సాధించాలి

: రాజ్‌నాథ్ సింగ్

ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు సహకారం

: ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు



శేరిలింగంపల్లి,నవంబర్ 15 (ప్రజావినికిడి): అధునాతన సాంకేతిక పరిజ్ఞాన రంగంలో భారత్ మరింత పురోగతి సాధించి ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలవాలని కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అన్నారు. సాంకేతికతను వినియోగించుకోవడమే కాకుండా, సొంతంగా ఆవిష్కరణలు చేపట్టి ప్రపంచానికి అందించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. రక్షణ రంగంలో స్వావలంబన సాధించేందుకు స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానం, నైపుణ్యాలను బలోపేతం చేయాలని సూచించారు. హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో నిర్వహిస్తున్న ఎన్‌డీఈ-2026, ఏరోనాట్-2026 అంతర్జాతీయ సదస్సులను ఆదివారం

మిగతా2లో...

తుఫాను సాయం అందించండి

మురసు తుపానుతో ఏపీకి రూ.2,484 కోట్ల నష్టం..

కేంద్ర బృందంతో వర్చువల్‌గా సమావేశమైన సీఎం చంద్రబాబు

రాష్ట్రానికి తక్షణ తుపాను సాయం అందించాలని విజ్ఞప్తి

నాలుగు జిల్లాల్లోని 60 ప్రాంతాల్లో పర్యటించిన కేంద్ర బృందం

క్షేత్రస్థాయిలో నష్టం తీవ్రంగా ఉందని తెలిపిన కేంద్ర అధికారులు



అమరావతి,నవంబర్ 15 (ప్రజావినికిడి):: మురసు తుపాను ఆంధ్రప్రదేశ్‌పై తీవ్ర ప్రభావం చూపింది. రాష్ట్రవ్యాప్తంగా పంటలు, రహదారులు, విద్యుత్ వ్యవస్థ, ఇళ్లు దెబ్బతినడంతో మొత్తం రూ. 2,484 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు వెల్లడించారు. తుపాను నష్టాలను అంచనా వేసేందుకు రాష్ట్రంలో పర్యటించిన కేంద్ర అంతర్ మంత్రిత్వ శాఖల బృందంతో ఆదివారం ఆయన వర్చువల్‌గా సమావేశమై పరిస్థితిని వివరించారు. రాష్ట్రానికి తక్షణ ఆర్థిక సాయం అందించాలని కేంద్రాన్ని కోరారు. **నాలుగు జిల్లాల్లో 60 ప్రాంతాల్లో పరిశీలన** కేంద్ర హోంశాఖ సంయుక్త కార్యదర్శి చిత్తరంజన్ దాస్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యుల బృందం రెండు బృందాలుగా విడిపోయి బాపట్ల, పల్నాడు, ఏలూరు, తూర్పుగోదావరి జిల్లాల్లోని సుమారు 60 ప్రాంతాల్లో పర్యటించింది. పంట పొలాలు, రహదారులు, కాలువలు,

మిగతా2లో...

అభ్యర్థులను ప్రకటించిన జనసేన

మేయర్, మున్సిపల్ ఛైర్మన్ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసిన పవన్ కల్యాణ్

శ్రీకాకుళం కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణి

కాకినాడ కార్పొరేషన్ మేయర్ బరిలో ఆకుల భవాని

రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం ఛైర్మన్ అభ్యర్థుల ప్రకటన



చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం

అమరావతి,నవంబర్ 15 (ప్రజావినికిడి): ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మర్యాదపూర్వకంగా కలిశారు. తన కుమార్తె వైఎస్ అంజలి రెడ్డి, సోమల రఘురామ్ రెడ్డి వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించాలని కోరుతూ వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. చంద్రబాబు నివాసానికి వెళ్లిన షర్మిల పెళ్లి వివరాలను ఆయనకు తెలియజేసి, తప్పక హాజరుకావాలని ఆహ్వానించారు. ఈ విషయాన్ని ఆమె సామాజిక మాధ్యమాల్లో వెల్లడించారు. ఇప్పటికే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డితో పాటు పలువురు ప్రముఖులను కలిసి ఆహ్వానించిన షర్మిల, తాజాగా చంద్రబాబును కలవడం రాజకీయ



ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

నక్సలిజం కోరల్లో గిరిజన సమాజం

న్యూఢిల్లీ, నవంబర్ 15 (ప్రజావినికిడి): నక్సల్స్ హింసాకాండ వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజన సమాజమేనని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో గిరిజనులను కనీసం ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం కూడా లేకుండా చేశారని పేర్కొన్నారు. గిరిజన సమరయోధుడు బిర్సా ముండా 151వ జయంతిని పురస్కరించుకుని ఆదివారం మహారాష్ట్రలోని గడ్చిరోలిలో నిర్వహించిన 'జనజాతీయ గౌరవ దివస్' కార్యక్రమంలో మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు ఆదివాసీల సమస్యలను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. మావోయిస్టులు చిన్నారులను, గిరిజన యువతులను అపహరించుకుపోయిన సందర్భాల్లోనూ పాలకులు మౌనం వహించారని అన్నారు. గిరిజనులను ఓటు వేయనివ్వకుండా అడ్డుకున్నా స్పందించలేదని, సమస్యలను పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు. నక్సల్స్ హింసతో గిరిజన కుటుంబాలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాయని, వారి జీవన ప్రమాణాలు దెబ్బతిన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

హింస తగ్గడంతో గిరిజన ప్రాంతాల్లో మార్పులు

మావోయిస్టు హింసను అదుపులోకి తీసుకురావడంతో గిరిజన ప్రాంతాల్లో భద్రతా పరిస్థితులు మెరుగుపడుతున్నాయని ప్రధాని తెలిపారు. గతంలో భయాందోళనల మధ్య జీవించిన గిరిజన కుటుంబాలు ఇప్పుడు ప్రశాంత వాతావరణంలో జీవించే పరిస్థితులు ఏర్పడుతున్నాయని అన్నారు. భద్రత పెరగడంతో గిరిజన తల్లులు, సోదరీమణులు ప్రభుత్వంపై విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. హింసాకాండ కారణంగా బాల్యాన్ని కోల్పోయిన చిన్నారులు ప్రస్తుతం విద్యను అభ్యసిస్తూ, ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ముందుకు సాగుతున్నారని వివరించారు.

పేదరిక నిర్మూలనలో కీలక పురోగతి

దేశంలో పేదరిక నిర్మూలనకు చేపట్టిన చర్యల ఫలితంగా గత 12 ఏళ్లలో సుమారు 50 కోట్ల మంది అత్యంత పేదరికం నుంచి బయటపడ్డారని మోదీ వెల్లడించారు. స్వాతంత్ర్యం తర్వాత భారత్ సాధించిన అతిపెద్ద విజయాల్లో ఇదొకటని పేర్కొన్నారు. గిరిజనుల అభివృద్ధి, వారి హక్కుల పరిరక్షణ, విద్య, ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావించారు.

సాగునీటి ప్రాజెక్టులకు చేయూతనివ్వండి

(మొదటి పేజీ తరువాయి)

రేవంత్‌రెడ్డి సమావేశమై మూడు వినతిపత్రాలు అందజేశారు.**రూ.50 వేల కోట్లతో ప్రాజెక్టులు.. ఇంకా అనుమతుల కోసం ఎదురుచూపులు** తెలంగాణ సాగునీరు, తాగునీటి అవసరాలను తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కీలక ప్రాజెక్టులపై సీఎం ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ బహుళార్ధ సాధక ప్రాజెక్టు, డిండి ఎత్తిపోతల పథకాల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే రూ.50 వేల కోట్లకు పైగా ఖర్చు చేసిందని వివరించారు. అయినప్పటికీ పర్యావరణ, ఇతర చట్టబద్ధమైన అనుమతులు పెండింగ్‌లో ఉండటంతో ఆశించిన ప్రయోజనాలు ప్రజలకు అందడం లేదని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన పర్యావరణ అనుమతుల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు సానుకూల తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఇక ఆలస్యం చేయకుండా అవసరమైన అనుమతులు మంజూరు చేయించాలని కోరారు. రాష్ట్రానికి న్యాయబద్ధంగా రావాల్సిన నీటి వాటాను వినియోగించుకోవడంలో ఎదురవుతున్న అడ్డంకులను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.**తుమ్మిడిహట్టి ఎత్తు పెంపునకు మహారాష్ట్రను ఒప్పించండి** ప్రాణహిత నదిపై తుమ్మిడిహట్టి ప్రాజెక్టును 152 మీటర్ల ఎత్తుతో నిర్మించేందుకు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించాలని రేవంత్‌రెడ్డి ప్రధానిని కోరారు. ఇటీవల మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌తో తాను సమావేశమైన విషయాన్ని వివరించారు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల మహారాష్ట్రలో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. రాష్ట్ర సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ప్రాజెక్టుకు మహారాష్ట్ర నుంచి అనుకూల నిర్ణయం వచ్చేలా కేంద్రం చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.**సమ్మక్క-సారలమ్మకు ఛత్తీస్‌గఢ్ ఎన్‌వోసీ ఇప్పించండి** సమ్మక్కసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)ను ఇప్పటికే కేంద్ర



జలవనరుల సంఘానికి సమర్పించినట్లు సీఎం తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం (ఎఫ్‌ఆర్‌ఎల్), బ్యాక్‌వాటర్ స్థాయిల ఆధారంగా ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములు, గ్రామాలను గుర్తించేందుకు సమగ్ర సర్వే నిర్వహించామని వివరించారు. ఇందుకోసం రూ.9.88 కోట్లు చెల్లించినట్లు తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో ముంపునకు గురయ్యే భూములకు పరిహారం చెల్లించేందుకు తెలంగాణ సిద్ధంగా ఉందని, ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్‌వోసీ) త్వరగా వచ్చేలా చూడాలని ప్రధానిని కోరారు.**సాస్మి కింద మరో రూ.5 వేల కోట్లు ఇవ్వండి** రాష్ట్రంలో 70 నుంచి 90 శాతం వరకు పూర్తయిన సాగునీటి ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేసేందుకు ప్రత్యేక సహాయం అవసరమని రేవంత్‌రెడ్డి తెలిపారు. సాస్మి పథకం కింద తెలంగాణకు అదనంగా రూ.5 వేల కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను దాదాపు పూర్తయిన ప్రాజెక్టుల పనులకు వినియోగిస్తామని వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో వ్యవసాయ రంగం తీవ్రంగా నష్టపోయిందని, భూగర్భ జలాల నిల్వలు తగ్గకుండా సంరక్షించేందుకు ప్రత్యేక కార్యాచరణ అవసరమని పేర్కొన్నారు. భూగర్భ జలాల సంరక్షణకు రూ.5 వేల కోట్ల ఆర్థిక సాయం అందించాలని కోరారు.**పీఎంకేఎస్‌వై కింద నాలుగు ప్రాజెక్టులకు నిధులు** ప్రధానమంత్రి కృషి సించాయ్ యోజన (పీఎంకేఎస్‌వై) కింద రాష్ట్రంలోని నాలుగు సాగునీటి ప్రాజెక్టులకు నిధులు మంజూరు చేయాలని సీఎం కోరారు. ఇంటిగ్రేటెడ్ సమ్మక్కసాగర్-సీతారామ ఎత్తిపోతల పథకానికి రూ.5,183 కోట్లు, మోడికుంట వాగు ప్రాజెక్టుకు రూ.392 కోట్లు, చిన్న కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.171 కోట్లు, చనాకా-కొరాటా బ్యారేజీకి రూ.103 కోట్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రాజెక్టులకు కేంద్రం ఆర్థిక సహకారం అందిస్తే రాష్ట్రంలో సాగునీటి సౌకర్యాలు మరింత విస్తరించే అవకాశం ఉంటుందని వివరించారు.**ఖేలో ఇండియా పోటీలకు సహకరించినందుకు కృతజ్ఞతలు** తెలంగాణలో 8వ ఎడిషన్ ఖేలో ఇండియా క్రీడల నిర్వహణకు అవకాశం కల్పించినందుకు ప్రధాని మోదీకి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. 2026 డిసెంబరు 11 నుంచి 22 వరకు హైదరాబాద్‌లో ఈ పోటీలు జరగనున్నాయి. క్రీడల ప్రారంభోత్సవం, ముగింపు వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని ప్రధానిని ఆహ్వానించారు. 2002లో జాతీయ క్రీడలు, 2007లో ప్రపంచ మిలిటరీ క్రీడలను విజయవంతంగా నిర్వహించిన అనుభవం తెలంగాణకు ఉందని వివరించారు.ప్రధానితో సమావేశం అనంతరం సీఎం రేవంత్‌రెడ్డి కేంద్ర క్రీడలు, యువజన వ్యవహారాల శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయను ఆయన నివాసంలో కలిశారు. ఖేలో ఇండియా పోటీల నిర్వహణకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ముఖ్యమంత్రి వెంట మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, రాష్ట్ర ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి జితేందర్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉన్నారు. ప్రధాని భేటీ వివరాలను అనంతరం మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వాకిటి శ్రీహరి మీడియాకు వెల్లడించారు.

తుఫాను సాయం అందించండి

(మొదటి పేజీ తరువాయి)

విద్యుత్ వ్యవస్థ, మత్స్యకారుల బోట్లకు జరిగిన నష్టాన్ని పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడింది. గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు, విద్యుత్ స్తంభాలు భారీగా దెబ్బతిన్నట్లు గుర్తించింది.**రైతాంగానికి కోలుకోలేని దెబ్బ** మురసు తుపాను ప్రభావంతో తూర్పుగోదావరి జిల్లాలో 80 శాతం, ఏలూరు జిల్లాలో 90 శాతం వరకు వరి పంట దెబ్బతిన్నట్లు కేంద్ర బృందం తెలిపింది. మామిడి, బొప్పాయి వంటి ఉద్యాన పంటలకూ తీవ్ర నష్టం వాటిల్లిందని వివరించింది. రాష్ట్ర ప్రభుత్వ అంచనాల ప్రకారం 1,43,617 హెక్టార్లలో పంటలు దెబ్బతినగా, 1,86,063 మంది రైతులు నష్టపోయారు. వ్యవసాయ రంగానికి రూ.875 కోట్లు, ఉద్యాన రంగానికి రూ.337 కోట్ల నష్టం వాటిల్లింది. **రహదారులు, విద్యుత్ వ్యవస్థకు భారీ నష్టం** రాష్ట్రవ్యాప్తంగా 1,385 కిలోమీటర్ల రహదారులు దెబ్బతినడంతో రూ.888 కోట్ల నష్టం సంభవించింది. 10,192 హెచ్‌టీ విద్యుత్ స్తంభాలు, 6,442 ఎల్‌టీ స్తంభాలు, 1,448 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. మొత్తం 3,859 ఇళ్లు ధ్వంసమయ్యాయి. సహాయక చర్యల కోసం ప్రభుత్వం ఇప్పటికే రూ.37 కోట్లు ఖర్చు చేసింది.**తక్షణ సాయం అందించాలని విజ్ఞప్తి** వరుస తుపాన్లు, ఎల్‌నినో ప్రభావంతో రైతాంగం సహా పలు రంగాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని చంద్రబాబు కేంద్ర బృందానికి వివరించారు. తీర ప్రాంతాల్లో భవిష్యత్తులో తుపాన్లను తట్టుకునేలా మౌలిక సదుపాయాలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నష్టాలపై సమగ్ర నివేదికను త్వరగా కేంద్రానికి సమర్పించి, బాధితులకు తక్షణ ఆర్థిక సాయం అందేలా చూడాలని కోరారు. ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు తగిన పరిహారం, బాధిత కుటుంబాలకు అదనపు సహాయం అందించే అంశాలను కూడా పరిశీలించాలని కేంద్ర బృందం సూచించింది.

సాంకేతిక రంగంలో భారత్ మరింత ముందుకు సాగాలి

(మొదటి పేజీ తరువాయి)

ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని, పరిశోధనలు, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు.తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఎన్‌డీటీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటుకు ప్రభుత్వం సహకరిస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను ప్రపంచస్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కేంద్రంగా అభివృద్ధి చేయడమే లక్ష్యమన్నారు.పరిశ్రమల భద్రత, నాణ్యత ప్రమాణాల పరిరక్షణలో నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ (ఎన్‌డీటీ) నిపుణుల పాత్ర కీలకమని డీఆర్‌డీఓ డైరెక్టర్ జనరల్, ఇండియన్ సొసైటీ ఫర్ నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అధ్యక్షుడు డాక్టర్ జైటీర్థ్ ఆర్.జోషి పేర్కొన్నారు. ఈ సదస్సుల్లో దేశ విదేశాలకు చెందిన 2 వేల మందికి పైగా నిపుణులు, 100కు పైగా సంస్థల ప్రతినిధులు పాల్గొంటున్నారు.

చంద్రబాబుకు షర్మిల వివాహ ఆహ్వానం

(మొదటి పేజీ తరువాయి)

ప్రాధాన్యత సంతరించుకుంది.షర్మిల కుమార్తె వివాహం నవంబర్ 25న జరగనుండగా, డిసెంబర్ 5న విందు కార్యక్రమం నిర్వహించనున్నారు.

యువత పారిశ్రామికవేత్తలుగా ఎదగాలి

(మొదటి పేజీ తరువాయి)

నైపుణ్యాలను సద్వినియోగం చేసుకుంటే పారిశ్రామిక రంగంలో అనేక అవకాశాలను అందిపుచ్చుకోవచ్చని అన్నారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్రమను ఉప ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పరిశ్రమ స్థాపించిన యువ పారిశ్రామికవేత్తలు విశాల్, సాగర్‌లను ప్రత్యేకంగా అభినందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువకులు ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా, సొంతంగా పరిశ్రమను స్థాపించి పారిశ్రామిక రంగంలోకి అడుగుపెట్టడం అభినందనీయమని పేర్కొన్నారు.**మరికొందరికి ఉపాధి కల్పించడమే లక్ష్యం కావాలి** యువత కేవలం తమ కుటుంబాల అభివృద్ధికే పరిమితం కాకుండా, సమాజానికి ఉపయోగపడేలా ఆలోచించాలని భట్టి విక్రమార్క సూచించారు. స్వయంగా ఉపాధి పొందడంతోపాటు ఇతరులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములు కావాలని అన్నారు. నూతన ఆలోచనలు, సృజనాత్మకత, పట్టుదలతో ముందుకు సాగితే యువత విజయవంతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగగలదని తెలిపారు.**పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ సహకారం** రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు, యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. పరిశ్రమలు ప్రారంభించాలనుకునే యువతకు అవసరమైన సహకారం అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. విశాల్, సాగర్ తమ పరిశ్రమను మరింత విస్తరించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని, భవిష్యత్తులో మరెందరో యువతకు స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్షించారు.యువత సాధించే విజయాలు వ్యక్తిగత అభివృద్ధితోపాటు సమాజ పురోగతికి కూడా దోహదపడాలని, పారిశ్రామికవేత్తలు సామాజిక బాధ్యతతో వ్యవహరిస్తూ ఉపాధి అవకాశాల కల్పనలో ముందుండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, సీపీఓ సౌమ్య, జీఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి, పలువురు పారిశ్రామికవేత్తలు, అధికారులు పాల్గొన్నారు.

విదేశీ పర్యటనలు మాని.. గ్రామాల్లో పర్యటించాలి

- రాహుల్‌గాంధీపై అమిత్‌షా విమర్శలు

పుణె, నవంబర్ 15 (ప్రజావినికిడి):

అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా రాహుల్‌గాంధీ వ్యాఖ్యలు చేస్తున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా విమర్శించారు. భారత్ అభివృద్ధి, ప్రజాస్వామ్య వ్యవస్థపై విదేశీ ప్రతినిధుల సమక్షంలో విమర్శలు చేయడం సరికాదని అన్నారు. అధికారంలోకి రావాలంటే విదేశీ పర్యటనలు మాని, దేశంలోని గ్రామాల్లో పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకోవాలని రాహుల్‌గాంధీకి సూచించారు.ఆదివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన కార్యక్రమంలో అమిత్‌షా మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్‌లో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావించారు. భారత్ పేరుతో నిర్వహించిన సదస్సులోనే దేశ ప్రతిష్ఠను దిగజార్చేలా మాట్లాడటం దురదృష్టకరమని ఆరోపించారు. రాజకీయ విభేదాలు ఉన్నప్పటికీ అంతర్జాతీయ వేదికలపై దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించేలా వ్యవహరించకూడదని పేర్కొన్నారు.వరుస ఎన్నికల పరాజయాల నేపథ్యంలో కాంగ్రెస్ నాయకత్వం నిరాశతో దేశంపై విమర్శలు చేస్తోందని అమిత్‌షా ఆరోపించారు. కాంగ్రెస్ పాలనలో భారీ అవినీతి జరిగిందని విమర్శిస్తూ, ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం 12 ఏళ్లలో సాధించిన అభివృద్ధిని వివరించారు. కాంగ్రెస్ నేతలు ఇదే వైఖరిని కొనసాగిస్తే మరో 30 ఏళ్లపాటు అధికారానికి దూరంగా ఉండాల్సి వస్తుందని హెచ్చరించారు.

తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు

- కాంగ్రెస్, బీజేపీ నేతల తీరుపై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్,నవంబర్ 15 (ప్రజావినికిడి):. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాంగ్రెస్, బీజేపీ నేతలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం తాకట్టు పెడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. జాతీయ నాయకుల మెప్పు కోసం రాష్ట్ర గౌరవాన్ని పక్కనపెట్టి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గాంధీ కుటుంబానికి బాడీగార్డులా వ్యవహరిస్తున్నారని కేటీఆర్ ఎద్దేవా చేశారు. రాహుల్‌గాంధీ బైక్ వెంట మంత్రి, పీసీసీ అధ్యక్షుడు పరుగెత్తిన తీరును ప్రస్తావిస్తూ.. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచేలా ఈ వ్యవహారం ఉందని విమర్శించారు.మరోవైపు కేంద్ర మంత్రి అమిత్‌షాకు బీజేపీ రాష్ట్ర నాయకులు ఇస్తున్న ప్రాధాన్యంపైనా కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. అమిత్‌షా కాళ్లకు నమస్కరిస్తూ, ఆయన చెప్పులు మోసే స్థాయికి దిగజారడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్రం ఆత్మగౌరవం, స్వాభిమానం కోసం జరిగిన పోరాట ఫలితంగా ఏర్పడిందని, ఆ విలువలను కాంగ్రెస్, బీజేపీ నేతలు విస్మరిస్తున్నారని కేటీఆర్ తన 'ఎక్స్' పోస్టులో విమర్శించారు.

అభ్యర్థులను ప్రకటించిన జనసేన



ఆంధ్రప్రదేశ్‌లోని రెండు మున్సిపల్ కార్పొరేషన్లు, మూడు మున్సిపాలిటీలలో మేయర్, చైర్మన్ స్థానాలకు పోటీ చేసే జనసేన అభ్యర్థులను పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ ఖరారు చేశారు. ఇటీవల ఎన్నికలు జరగ్గా మిగిలిన పట్టణ స్థానిక సంస్థల (ఖాదీ)కు నవంబరు 26న పోలింగ్ జరగనుంది. 4 కార్పొరేషన్లు, 16 మున్సిపాలిటీలు, 3 నగర పంచాయతీలకు ఈ విడతలో ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇప్పటికే బీజేపీ తాను పోటీ చేసే స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించింది. తాజాగా ఈ ఎన్నికల్లో బరిలో దిగే తమ అభ్యర్థుల పేర్లను ఖరారు చేసినట్లు జనసేన పార్టీ కేంద్ర కార్యాలయం ఆదివారం సాయంత్రం అధికారికంగా వెల్లడించింది.శ్రీకాకుళం, కాకినాడ కార్పొరేషన్లలో మేయర్ పదవుల కోసం మహిళా నేతలకు పార్టీ నాయకత్వం అవకాశం కల్పించింది. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా డాక్టర్ దానేటి రాధారాణిని ఎంపిక చేశారు. అలాగే కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థిగా ఆకుల భవాని పేరును పవన్ కల్యాణ్ ఖరారు చేశారు.మున్సిపాలిటీల విషయానికి వస్తే, విజయనగరం జిల్లా రాజాం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా బనిశెట్టి సౌజన్య లత బరిలో నిలవనున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా డాక్టర్ చుండూరి మల్లేశ్వరి, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీ చైర్మన్ అభ్యర్థిగా పాలూరు వెంకటేశ్వరరావు పేర్లను పార్టీ నాయకత్వం ఖరారు చేసింది.స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరఫున సమర్థులైన నేతలను బరిలోకి దించే క్రమంలో క్షేత్రస్థాయి సమీక్షలు నిర్వహించి, పార్టీ శ్రేణుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అధినేత పవన్ కల్యాణ్ ఈ అభ్యర్థులను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. అభ్యర్థుల ప్రకటనతో ఆయా నియోజకవర్గాల్లో జనసేన పార్టీ శ్రేణులు ఎన్నికల ప్రచారానికి సమాయత్తమవుతున్నాయి.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక
సోమవారం16 నవంబర్ 2026

ఘనంగా బిర్సముండా జయంతి వేడుకలు





వాజేడు,నవంబర్ 15,(ప్రజావినికిడి):
వాజేడు మండల కేంద్రంలో ఎఎన్ఎస్, నాయకులు బిర్సముండా జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగినది.ఈ కార్యక్రమం ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎఎన్ఎస్, ఆదివాసి నవనిర్మాణ సేనా ములుగు జిల్లా అధ్యక్షులు ఎట్టి విద్యాసాగర్ మాట్లాడుతూ, బిర్సముండా జార్ఖండ్ రాష్ట్రంలో కుంటి జిల్లా,ఉలీహతు గ్రామంలో 1875 నవంబర్15న జన్మించి ఆనాడు మన ఆదివాసీలకోసం బ్రిటీష్ వలసపాలన,జమీందారీ వ్యవస్థ,దోపిడి మరియు బలవంతపు వెట్టిశాకిరికి వ్యతిరేకంగా గెరిల్లా పోరాటాన్నీ నడిపారు అని అన్నారు. బిర్సముండా పోరాటం ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం 1908 లో చోటా నాగపూర్ కౌలుదారు చట్టాన్ని తీసుకువచ్చింది దీని వలన గిరిజనుల భూములను గిరిజనేతరులకు బదిలీ చేయకుండా రక్షణ లభించిందని ఆయన అన్నారు.అలాగే మనం కూడా పోరాట యోధుల స్ఫూర్తితో ఉద్యమాన్ని ప్రతిగూడెనికి వెళ్ళి ఆదివాసీలందరిని అవగాహన పరచి ఆదివాసి చట్టాలను అమలుపరిచే వరకు గెరిల్లా లాంటి పోరాటాలు చేసి మా హక్కులు మేము సాధించుకుంటామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎస్,రాష్ట్ర సోషల్ మీడియా ప్రతినిధి పాయం అజయ్,ఏఎన్ ఎస్ వాజేడు మండల కార్యదర్శి తల్లడి ప్రసాద్, నాయకులు పాయం శివాజి,నాగలక్ష్మి,ఉయిక పార్వతీ,ఉయిక సత్యబాబు, ఉయిక రమేష్,బొగ్గుల సూరిబాబు,ఉయిక శివ, పాయం శశిధర్,జెస్సిత,అభిజ్ఞాన్ తదితరులు పాల్గొన్నారు.

తుడుందెబ్బ, అధ్వర్యంలో బిర్సా ముండా జయంతి
వాజేడు మండల కేంద్రంలో కొమరం భీమ్ జంక్షన్లో ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ ఆధ్వర్యంలో, బిర్సా ముండా మహనీయుని జయంతి వేడుకలు అత్యంత ఘనంగా, స్ఫూర్తిదాయక వాతావరణంలో జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి జానకిరమణ, ములుగు జిల్లా అధ్యక్షులు సిద్ధబోయిన సర్వేశ్వరరావు విచ్చేసి,బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథి పాయం జానకి రమణ, సిద్ధబోయిన సర్వేశ్వరరావు మాట్లాడుతూ, చోటా నాగపూర్ ప్రాంతం ప్రస్తుతం ఝార్ఖండ్ రాష్ట్రం బ్రిటిష్ పరిపాలనలో అనేక అక్రమాలకు దౌర్జన్యాలకు దోపిడీలకు అధిక వడ్డీ రేట్లు కట్టి భూములు లాక్కునే భూస్వాములు, జమీందార్లు ఆదివాసీలను చిత్రహింసలు పెట్టి పరిపాలించే సందర్భంలో బిర్సా ముండ ఉద్యమం ఒక స్ఫూర్తిదాయకం బ్రిటీష్ ప్రభుత్వాన్ని గడగడలాడించిన సూర్యుడు బిర్సా ముండా బిర్సా ముండా సమాజానికి చేసిన సేవలు చిరస్మరణీయమని,వారి ఆశయాలను సిద్ధాంతాలను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి చేప లక్ష్మణ్, ఉపాధ్యక్షులు వాసం సంతోష్, తుడుం దెబ్బ సలహాదారులు అత్యంత సన్నిహితులు, ఆదివాసి యువతరం తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్ నగర్,(ప్రజావినికిడి):
శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు లింగారం కుమార్ గౌడ్ కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వేడుకకు షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జర్నలిస్ట్ కేపీ, సీనియర్ జర్నలిస్టులు గట్టుపల్లి మోహన్ రెడ్డి,రాఘవేందర్ గౌడ్,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ అలీ ఖాన్,సీనియర్ నాయకుడు చెంది తిరుపతి రెడ్డి,దంగు శ్రీనివాస్ యాదవ్, బాలరాజు గౌడ్, కౌన్సిలర్ మురళీమోహన్, అప్పి,జమ్రుద్ ఖాన్,ముబారక్ అలీ ఖాన్, జాంగారి రవి, శ్రీనివాస్,వీర్లపల్లి అన్వర్, మాణిక్యం, గుడుపల్లి బీరప్ప, జంగయ్య, సురేష్, లింగారెడ్డిగూడ అశోక్,సీతారాం, మహేందర్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు.





వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన చౌలపల్లి ప్రతాప్ రెడ్డి

షాద్ నగర్ జర్నలిస్టులు, పేపర్ ప్రకాష్, కేపీ,రాఘవేందర్ గౌడ్ తదితరులు

షాద్ నగర్,(ప్రజావినికిడి):
శంషాబాద్‌లోని ఎస్ఎస్ కన్వెన్షన్ హాల్‌లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన టీడీపీ నాయకుడు లింగారం కుమార్ గౌడ్ కుమార్తె వివాహ వేడుక ఘనంగా జరిగింది.ఈ వివాహ వేడుకకు షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు గుడిపల్లి ప్రకాష్, ఖాజాపాషా కేపీ, పీఏసీఎస్ చైర్మన్ చల్లా శ్రీకాంత్ రెడ్డి,దంగు శ్రీనివాస్ యాదవ్,వెంకట్ రెడ్డి,మాజీ ఎంపీటీసీ భార్గవ్ రెడ్డి,ఒగ్గు కిషోర్, రాఘవేందర్ గౌడ్,శ్రీశైలం గౌడ్, పాపిరెడ్డిగూడెం వెంకటనారాయణ తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు.



యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా పారిశ్రామికవేత్తలుగా ఎదిగి, మరికొందరికి ఉపాధి కల్పించాలి..

ఎన్ఎస్ ఇండస్ట్రీస్ ప్రారంభోత్సవంలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క





రంగారెడ్డి,(ప్రజావినికిడి):
యువత ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదగడంతో పాటు, మరికొందరికి ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు.ఆదివారం రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం మంఖాల్ లో ఏర్పాటు చేసిన ఎన్ఎస్ ఇండస్ట్రీస్ పరిశ్రమను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ఎన్ఎస్ ఇండస్ట్రీస్‌ను స్థాపించి పారిశ్రామికవేత్తలుగా నూతన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న యువకులు విశాల్, సాగర్‌లను అభినందించారు. ఉన్నత విద్యను అభ్యసించిన యువత ఉద్యోగాల కోసం ఇతరులపై ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడాలనే సంకల్పంతో పరిశ్రమను స్థాపించడం అభినందనీయమన్నారు. తాము స్వయంగా పారిశ్రామికవేత్తలుగా ఎదగడంతో పాటు, ఇతరులకు కూడా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో ముందుకు రావడం ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. యువ పారిశ్రామికవేత్తల ప్రోత్సాహానికి రాష్ట్ర ప్రభుత్వం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని, పరిశ్రమల స్థాపనకు అవసరమైన సహకారం అందిస్తుందని తెలిపారు.విశాల్,సాగర్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, రాష్ట్రంలో పరిశ్రమలు స్థాపించాలనుకునే యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. వీరి విజయ ప్రయాణం మరెందరో యువతకు స్ఫూర్తినిస్తూ, స్వయం ఉపాధి, పారిశ్రామిక అభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.యువతలో ఉన్న నైపుణ్యం, ఆలోచనా శక్తి, సృజనాత్మకత సమాజ అభివృద్ధికి ఉపయోగపడాలని,వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజానికి ప్రయోజనం చేకూర్చే కార్యక్రమాల్లో యువ పారిశ్రామికవేత్తలు భాగస్వాములు కావాలని ఉప ముఖ్యమంత్రి సూచించారు.
ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీంద్ర రావు, సీపీఓ సౌమ్య, జిఎం ఇండస్ట్రీస్ శ్రీలక్ష్మి,పలు పారిశ్రామిక వేత్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఛట్ పూజ కార్యక్రమం లో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి



ఎల్బీనగర్,(ప్రజావినికిడి):
ఆదివారం రోజు కర్మన్‌ఘాట్ హనుమాన్ దేవాలయం ఆవరణలో "ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్" ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించిన ఛట్ పూజ కార్యక్రమంలో ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఉత్తర భారతీయ సోదర సోదరీమణులు ఆచరిస్తున్న ఛట్ పూజ దేశం యొక్క సమగ్ర సాంస్కృతిక ఐక్యతకు ప్రతీక అని అన్నారు.సూర్యుని ఆరాధించే ఈ పూజలో భక్తులు నది తీరాల వద్ద ఉపవాస దీక్షలు,పండ్ల నైవేద్యాలు సమర్పించడం ద్వారా కృతజ్ఞతలు తెలిపే పవిత్ర సంస్కారం ఉందని పేర్కొన్నారు.
సూర్య దేవుడు,ఉషోదయ పూజ,అష్టమి పర్వదినాల విశిష్టతను గుర్తుచేస్తూ భక్తుల ఆరోగ్యం,సుఖశాంతి,కుటుంబ సుభిక్షత,రాష్ట్ర అభ్యున్నతి కోసం ప్రార్థించారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలో నివసిస్తున్న ఉత్తర భారతి ప్రజలకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు కావాల్సిన సహాయాన్ని అందిస్తామని సుధీర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కర్మన్ ఘాట్ హనుమాన్ మాజీ ధర్మకర్త మధుసాగర్,ఆలయ సిబ్బంది ప్రసాద్,ఉత్తర్ భారతి నాగరిక్ సంఘ్ సభ్యులుఎన్.కే.సింగ్, సంఘ్ పరివార్ కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కొత్తూరులో ఘనంగా ప్రారంభమైన ఛట్ పూజా

కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



కొత్తూరు,(ప్రజావినికిడి):ప్రకృతి మాతను,సూర్య భగవానుడిని ఆరాధించే అత్యంత పవిత్రమైన జాతీయ పండుగ ఛట్ పండుగని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. ఆదివారం కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలోని ఛట్ పూజా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి మాట్లాడుతూ,సూర్యారాధనకు ప్రతీకగా నిలిచే ఈ మహాపర్వం ప్రజల జీవితాల్లో సుఖ సంతోషాలతో ఆయురారోగ్యాలను ప్రసాదించాలని ప్రధాని ఆకాంక్షించారు.ముఖ్యంగా బీహార్,జార్ఖండ్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశ విదేశాల్లో స్థిరపడిన కోట్లాది మంది భక్తులు ఈ పండుగను అత్యంత భక్తిభావంతో జరుపుకుంటారని ఆయన అన్నారు.నదులు,జలాశయాల వద్ద ప్రత్యేక ఘాట్‌లను ముస్తాబు చేసి, సూర్యోదయం,సూర్యాస్తమయ వేళల్లో అర్ఘ్య ప్రధానం చేసేందుకు భక్తులు పెద్దఎత్తున తరలి వస్తారని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కడెంపల్లి శ్రీనివాస్ గౌడ్,మాజీ కౌన్సిలర్ మాదారం నర్సిములు గౌడ్,సోమ్లా నాయక్,జె. శ్రీనివాస్ గౌడ్,నాయకులు సిటీ కేబుల్ వెంకటేష్,శివ చారి,జంగగళ్ల అనిల్,శ్రీనివాస్ చారి తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో ఛట్ పూజ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్



షాద్‌నగర్,(ప్రజావినికిడి):పట్టణంలోని సి.ఎస్.కె.తిరుమల కాలనీలో ఘనంగా నిర్వహించిన ఛట్ పూజ వేడుకల్లో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్,మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని,ఛట్ మాతకు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.అనంతరం పూజలో పాల్గొన్న ప్రజలను ఆప్యాయంగా పలకరించి ఛట్ పూజ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు ఎంతో గొప్పవని,భిన్న ప్రాంతాలు,భిన్న ఆచారాలు కలిగిన ప్రజలు ఒకే కుటుంబంలా కలిసిమెలిసి పండుగలు జరుపుకోవడం మన దేశ ఐక్యతకు నిదర్శనమని అన్నారు.
షాద్‌నగర్ నియోజకవర్గంలో అన్ని ప్రాంతాలు,అన్ని వర్గాల ప్రజలకు సమాన గౌరవం,ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు.ప్రతి ఒక్కరూ తమ సంస్కృతి, సంప్రదాయాలను స్వేచ్ఛగా పాటిస్తూ సోదరభావంతో జీవించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్,కౌన్సిలర్ లు,పట్టణ అధ్యక్షుడు,కాలనీ వాసులు,ఉత్తర భారతీయ కుటుంబాలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

అక్రిడేషన్ కొనుక్కో.. రిపోర్టర్ అయిపో..

జర్నలిస్టుల అక్రిడేషన్ కార్డుల జారీలో భారీ అక్రమాల ఆరోపణలు..

రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు పలికిన కార్డులు.?

వార్తలు రాసే సత్తా ఉన్నవారు 10 శాతమేనా.? వసూళ్లకు పాల్పడేవారు 90 శాతమంటూ విమర్శలు..

నకిలీ విలేకరుల ఏరివేతలో సమాచార శాఖ పూర్తిగా విఫలమైందా.?



హైదరాబాద్, (ప్రజావినికిడి):

జర్నలిస్టు కావాలంటే వార్తలు రాయడం, ప్రజా సమస్యలపై అవగాహన ఉండడం, క్షేత్రస్థాయిలో సమాచారాన్ని సేకరించడం ఒకప్పుడు ప్రాథమిక అర్హతలుగా ఉండేవి. కనీసం ఇంటర్ పాసై, డిగ్రీ పూర్తి చేసిన వాళ్లు మంచి అవగాహన కలిగిన వాళ్లు మాత్రమే వార్తలు రాసి రిపోర్టర్లుగా చలామణి అయ్యేవారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో సంస్థ ఐడి లేదా అక్రిడేషన్ కార్డు చేతిలో ఉంటే చాలు రిపోర్టర్‌గా చలామణి కావచ్చనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అర్హతలు, అనుభవం, వృత్తి నిబద్ధత అసలు లేకున్నా కేవలం పలుకుబడి, పైరవీలు, అక్రమ లావాదేవీలకు పాల్పడుతున్న వాళ్లకే రిపోర్టర్లుగా ప్రాధాన్యత లభిస్తోందన్న ఆరోపణలు జర్నలిస్టు వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు బేరాలు.?

అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో రూ.20 వేల నుంచి రూ.50 వేల వరకు చేతులు మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నిజాయితీగా జర్నలిజం చేస్తూ ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తున్న అనేకమంది అర్హులైన జర్నలిస్టులకు కార్డులు దక్కకపోగా, అసలు వార్తలు రాయడం, సమాచారాన్ని సేకరించడం తెలియని చాలా మంది వ్యక్తులు మాత్రం అక్రిడేషన్ కార్డులు పొందారనే విమర్శలు ఉన్నాయి. నిజమైన జర్నలిస్టులు అక్రమ మార్గంలో కార్డులు కొనుగోలు చేయకపోవడంతో కనీస అవగాహన లేని ప్రభుత్వ అధికారులు కొంతమంది నిజమైన రిపోర్టర్లను అక్కడేషన్ కార్డు లేదని నకిలీ విలేకరులుగా చిత్రీకరిస్తున్నారు. వార్తలు రాసే వాళ్ళు అక్రిడేషన్ కార్డు కొనుక్కోకపోవడంతో నకిలీ రిపోర్టర్ లంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్నారు. కొందరు మాత్రం సులభంగా కార్డులు సంపాదిస్తున్నారనే ఆవేదన వ్యక్తమవుతోంది.

వార్తలు రాయరు.. వసూళ్లకే ప్రాధాన్యత

శంషాబాద్, జవహర్‌నగర్, ఎల్బీనగర్, శేర్లింగంపల్లి తదితర ప్రాంతాలతో పాటు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొందరు వ్యక్తులు జర్నలిజం అర్థం తెలియకుండా పత్రికల పేరుతో గుర్తింపు కార్డులు, అక్రిడేషన్ కార్డులు సంపాదించి వాటిని అడ్డుపెట్టుకుని వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వార్తలు రాయడం రాదు. ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదు. అధికారుల నుంచి సమాచారం సేకరించే ప్రయత్నం చేయడం తెలియదు. కేవలం స్థానిక పోలీస్ స్టేషన్లో కూర్చుని సెటిల్మెంట్లు చేయడానికి కొంతమంది ఐడి కార్డులు ఉపయోగించుకుంటున్నారు. కానీ ఎక్కడ ఏ వ్యాపారం జరుగుతోంది.? ఎవరిని బెదిరిస్తే డబ్బులు వస్తాయి.? తోటి రిపోర్టర్లను ఎలా అనగదొక్కాలి అనే ధోరణితో కొందరు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. కొత్త పత్రికల పేరుతో గుర్తింపు కార్డులు పొందుతూ జర్నలిజం ముసుగులో వ్యక్తిగత ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తున్నారనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి.

పదో తరగతి అర్హత కూడా లేని వారికి కార్డులా.?

అక్రిడేషన్ మంజూరులో విద్యార్హతలు, అనుభవం, ప్రచురిత వార్తలు, వృత్తిపరమైన ప్రమాణాలను ఎంతవరకు పరిశీలించారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పదో తరగతి కూడా చదవని వారికి సైతం అక్రమ మార్గాల్లో అక్రిడేషన్ కార్డులు మంజూరయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపితేనే వాస్తవాలు బయటపడతాయి. అర్హతలను పక్కనపెట్టి కార్డులు జారీ చేయడంలో సమాచార శాఖ అధికారులు, జిల్లా ప్రజాసంబంధాల అధికారులు (డీపీఆర్వోలు) బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ప్రెస్ అకాడమీ చుట్టూ పైరవీల పర్వం.?

ప్రెస్ అకాడమీ చైర్మన్‌తో పాటు ఆయనకు అనుబంధంగా ఉన్న జర్నలిస్ట్ సంఘాల సిఫార్సుల మేరకు చాక్లెట్లు పంచినట్లు అక్రిడేషన్ కార్డులు జారీ చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రిడేషన్ అనేది జర్నలిస్టుల వృత్తిపరమైన గుర్తింపు మాత్రమే కాకుండా, ప్రభుత్వ సమాచారాన్ని పొందేందుకు ఉపయోగపడే అధికారిక గుర్తింపు. అలాంటి కార్డుల జారీ విషయంలో పారదర్శకత లేకపోతే వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది.? అర్హులైన జర్నలిస్టులను పక్కనపెట్టి అనర్హులకు అవకాశం కల్పించారన్న ఆరోపణలకు సమాచార శాఖ అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

అక్రిడేషన్ పొందిన వారందరికీ రాత పరీక్షలు పెట్టాలి

అక్రిడేషన్ కార్డులు పొందిన ప్రతి ఒక్కరికీ జర్నలిజంపై ప్రాథమిక అవగాహన పరీక్షలు ప్రతి జిల్లా డీపీఆర్వోల సమక్షంలో నిర్వహించాలని జర్నలిస్టు వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. వార్తా రచన, వార్తా సేకరణ, ప్రజా సమస్యలు, రాజ్యాంగ విలువలు, పత్రికా నైతికత, మీడియా చట్టాలపై పరీక్షలు నిర్వహిస్తే అసలు జర్నలిస్టులెవరో, గుర్తింపు కార్డులు కొనుక్కొని వెనుక దాక్కున్నవారెవరో స్పష్టమవుతుందని జర్నలిస్టు సంఘాలు అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నాయి. కార్డుల మంజూరు ప్రక్రియను పారదర్శకంగా పరిశీలించి, నిబంధనలకు విరుద్ధంగా పొందిన కార్డులను వెంటనే రద్దు చేసి వాటిని జారీ చేసిన అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాయి.

కోర్టు మెట్లు ఎక్కేందుకు జర్నలిస్టు సంఘాల సిద్ధం


అక్రిడేషన్ కార్డుల జారీ ప్రక్రియలో జరిగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అనేక అవకతవకలపై ఆధారాలతో సహా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు కొన్ని జర్నలిస్టు సంఘాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. అర్హులైన జర్నలిస్టులకు న్యాయం చేయడంతో పాటు అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకునే వరకు పోరాటం కొనసాగిస్తామని సంఘాల ప్రతినిధులు స్పష్టం చేశారు.

ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించాలి

అక్రిడేషన్ కార్డు, సంస్థ ఐడి కార్డ్ అనేది వసూళ్లకు ఉపయోగపడే ఆయుధం కాదు.. ప్రజల తరఫున ప్రశ్నించే జర్నలిస్టుకు ఇచ్చే గుర్తింపు.ఆ గుర్తింపు వ్యవస్థను కొందరి స్వార్థ ప్రయోజనాలకు వేదికగా మారనివ్వకూడదు.సమాచార శాఖ కమిషనర్, ఉన్నతాధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టి,అర్హతల ఆధారంగా అక్రిడేషన్ కార్డుల జారీపై శ్వేతపత్రం విడుదల చేయాలి.లేదంటే నిజమైన జర్నలిస్టులకు అన్యాయం జరగడమే కాకుండా, మొత్తం జర్నలిజం వ్యవస్థ పరువు బజారున పడే ప్రమాదం ఉందని మీడియా వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

చౌదరిగూడలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవం..

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



షాద్ నగర్, (ప్రజావినికిడి):నియోజకవర్గంలోని చౌదరిగూడ మండల కేంద్రంలో శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని నిర్వహిస్తున్న ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే వై.అంజయ్య యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయంలో స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌ను ఆహ్వానించి ఘనంగా స్వాగతించారు.దైవ కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావాన్ని,ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు గ్రామంలో ఐక్యత, సౌభ్రాతృత్వాన్ని మరింత బలోపేతం చేస్తాయని ఈ సందర్భంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు హఫీజ్,శ్రీధర్ రెడ్డి,నటరాజన్, లక్ష్మణ్ నాయక్,సర్పంచులు సుమలత వెంకట్రాములు,దేవి రాంచరణ్, సోని శేఖర్,మాజీ సర్పంచ్ శ్రీశైలం,మాజీ ఎంపీటీసీ మాణయ్య,నాయకులు కొండి యాదయ్య, నర్సింలు,ధీమ గణేష్,వెంకటయ్య,శ్రీను,శేఖర్, చందు,సత్యం తదితరులు, ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

హాజీపల్లి సిండికెట్ కాలనీలలో రెండు హైమక్స్ లైట్లు ఏర్పాటు

హైమాక్స్ లైట్లను ప్రారంభించిన ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



షాద్ నగర్,(ప్రజావినికిడి):ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని హాజీపల్లి గ్రామంలో ఒకటి సిండికెట్ కాలనీ మరొక హైమక్స్ లైట్లను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన సొంత నిధులతో ఏర్పాటు చేయించిన హైమాక్స్ లైట్లను ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి ఆదివారం రోజు సాయంత్రం ప్రారంభించారు.సొంత నిధులతో గ్రామంలో చీకట్లను పారద్రోలి,రాత్రి వేళల్లో భద్రతతో కూడిన ప్రయాణానికి వీలు కల్పించినందుకు హాజీపల్లి గ్రామస్తులు, సిండికెట్ కాలనీ స్థానిక నాయకులు ఎమ్మెల్సీ కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమం హాజీ పల్లి సర్పంచ్ కుమార్,పట్టణ మాజీ కౌన్సిలర్స్ ఈశ్వర్ రాజు,కానుగు అనంతయ్య, నందకిషోర్, చెట్ల నర్సిమ,పాలమకుల చెన్నయ్య, కాంటెస్టెడ్ కౌన్సిలర్ రాజేందర్ సింగ్,సీనియర్ నాయకులు రాయికల్ వెంకట్ రెడ్డి,పోమాల్ పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్ రెడ్డి,కమ్మదనం సర్పంచ్ లత కిరణ్ కుమార్ గౌడ్ మాజీ ఎంపిటిసి అశోక్ రెడ్డి,మాజీ సర్పంచ్ తాండ్ర విష్ణు వర్ధన్ రెడ్డి,హాజీ పల్లి ఉపసర్పంచ్ ఇసునాతి గంగాదర్,కమ్మదనం గ్రామ కమిటీ అధ్యక్షులు రాజు,హాజీ పల్లి వార్డు సభ్యులు,సిండికెట్ కాలనీ వాసులు, గ్రామస్థులు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు



తిరుమల వెళ్లే భక్తులకు అలర్ట్..
ఫిబ్రవరి నెల శ్రీవారి దర్శనం



తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామిని దర్శించుకోవాలనుకునే భక్తులకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక సమాచారం అందించింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి నెలకు సంబంధించిన వివిధ రకాల దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు మరియు వసతి గదుల ఆన్‌లైన్ కోటాను విడుదల చేసే తేదీల షెడ్యూల్‌ను టీటీడీ అధికారికంగా వెల్లడించింది.

నవంబర్ 18 నుంచి ఆర్జిత సేవల డిప్ నమోదు

శ్రీవారి సుప్రభాతం, తోమాల, అర్చన, అష్టదళ పాదపద్మారాధన వంటి ఆర్జిత సేవా టికెట్ల ఎలక్ట్రానిక్ డిప్ (లక్కీ డిప్) కోటాను నవంబర్ 18వ తేదీ ఉదయం 10 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు. భక్తులు ఈ సేవా టికెట్ల కోసం నవంబర్ 20వ తేదీ ఉదయం 10 గంటల వరకు తమ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. లక్కీ డిప్‌లో టికెట్లు పొందిన వారు నవంబర్ 20 నుంచి 22వ తేదీ మధ్యాహ్నం 12 గంటల లోపు నిర్ణీత రుసుము చెల్లించి టికెట్లను ఖరారు చేసుకోవాల్సి ఉంటుంది.

నవంబర్ 21న సాధారణ ఆర్జిత సేవలు, వర్చువల్ సేవలు

కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవా టికెట్ల కోటాను నవంబర్ 21న ఉదయం 10 గంటలకు టీటీడీ వెబ్‌సైట్‌లో విడుదల చేయనుంది. అదే రోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటికి సంబంధించిన దర్శన స్లాట్ల కోటాను అందుబాటులో ఉంచనున్నారు.

నవంబర్ 23న అంగప్రదక్షిణ, శ్రీవాణి, వృద్ధుల కోటా

అంగప్రదక్షిణ టోకెన్ల కోటాను నవంబర్ 23న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. శ్రీవాణి ట్రస్టు దర్శన టికెట్ల కోటాను అదే రోజు ఉదయం 11 గంటలకు భక్తులకు అందుబాటులోకి తీసుకురానున్నారు. అలాగే, వయోవృద్ధులు, దివ్యాంగులు మరియు దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారి కోసం ఉద్దేశించిన ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్లను నవంబర్ 23న మధ్యాహ్నం 3 గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నారు.

స్వగ్రామంలో ముగిసిన గిరిబాబు అంత్యక్రియలు..

అశ్రునయనాల మధ్య ఆఖరి వీడ్కోలు

నవంబరు 14న హైదరాబాదులో తుదిశ్వాస విడిచిన గిరిబాబు

తండ్రి చితికి నిప్పంటించిన పెద్ద కుమారుడు రఘుబాబు

కన్నీటి వీడ్కోలు పలికిన కుటుంబ సభ్యులు, ప్రముఖులు

ఐదు దశాబ్దాల సినీ ప్రస్థానంలో 600కు పైగా సినిమాలు



ప్రముఖ సీనియర్ నటుడు గిరిబాబు (83) అంత్యక్రియలు ముగిశాయి. ప్రకాశం జిల్లాలోని ఆయన స్వగ్రామం రావినూతలలో ఆదివారం (నవంబర్ 15) సాయంత్రం అశ్రునయనాల మధ్య గిరిబాబుకు ఆఖరి వీడ్కోలు పలికారు. హైదరాబాద్‌లో నవంబర్ 14న తుదిశ్వాస విడిచిన ఆయన భౌతికకాయాన్ని కుటుంబ సభ్యులు ఒంగోలు సమీపంలోని రావినూతలకు తరలించారు. తన అంతిమ సంస్కారాలు స్వగ్రామంలోనే జరగాలన్న గిరిబాబు చివరి కోరిక, కుటుంబ సభ్యుల నిర్ణయం మేరకు అక్కడే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు.గిరిబాబు పెద్ద కుమారుడు, ప్రముఖ నటుడు రఘుబాబు అంత్యక్రియల ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షించారు. గ్రామ శ్మశానవాటికలో బంధుమిత్రులు, గ్రామస్థుల సమక్షంలో శాస్త్రోక్తంగా అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తండ్రి చితికి రఘుబాబు నిప్పంటించారు. తమ గ్రామానికి చెందిన వ్యక్తి సినీ రంగంలో అగ్ర నటుడిగా ఎదిగి తిరిగి ఊరి మట్టిలోనే కలవడంతో రావినూతల గ్రామంలో తీవ్ర భావోద్వేగాలు అలుముకున్నాయి. స్థానికులు, పరిసర ప్రాంతాల ప్రజలు భారీ సంఖ్యలో తరలివచ్చి గిరిబాబుకు కన్నీటి నివాళులు అర్పించారు.తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఐదు దశాబ్దాలకు పైగా గిరిబాబు తనదైన ముద్ర వేశారు. సుమారు 600కు పైగా చిత్రాల్లో నటించిన ఆయన విలన్‌గా, సహాయ నటుడిగా, హాస్య నటుడిగా ఎన్నో వైవిధ్యమైన పాత్రలను పోషించి మెప్పించారు. విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకున్నారు. ఆయన మృతి పట్ల టాలీవుడ్‌కు చెందిన పలువురు ప్రముఖులు, రాజకీయ నాయకులు తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తూ



గిరిబాబు కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఒక గొప్ప నటుడిని కోల్పోవడం తెలుగు చిత్రసీమకు తీరని లోటని సహచర నటులు కొనియాడారు.

ఒడ్డె లింగాపూర్ లో వీధి కుక్కల బీభత్సం...
నాలుగేళ్ల చిన్నారిపై దాడి!

కుక్కల నుండి చిన్నారిని రక్షించడానికి వెళ్లిన రాజుపై కుక్కల దాడి!!

- రాయికల్లో ప్రథమిక చికిత్స తర్వాత గాయపడ్డ చిన్నారిని రాజును మెరుగైన చికిత్స కొరకు జగిత్యాల హాస్పిటల్ కు తరలింపు



రాయికల్ మండలం నవంబర్,15(ప్రజావినికిడి):

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఒడ్డె లింగాపూర్ గ్రామంలో ఆదివారం వీధి కుక్కలు బీభత్సం సృష్టించాయి ఇంటి బయట ఆడుకుంటున్న నాలుగేళ్ల చిన్నారి రిశ్విక పై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో చిన్నారికి తీవ్ర గాయాలు అయ్యాయి. ముఖ్యంగా ముఖంపై గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

చిన్నారిపై కుక్కలు దాడి చేయడానికి గమనించిన యువకుడు రాజు, చిన్నారిని రక్షించేందుకు ప్రయత్నించగా కుక్కలు అతనిపైన దాడి చేశాయి. ఈ ఘటనలో రాజుకు కూడా గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన కుటుంబ సభ్యులు, గ్రామస్తులు క్షతగాత్రులైన చిన్నారి రిశ్వికతో పాటు యువకుడు రాజును రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు అక్కడ ప్రాథమిక వైద్యం అందించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గ్రామంలో వీధి కుక్కలు విచ్చలవిడిగా సంచరిస్తూ ప్రజలపై దాడులకు పాల్పడుతుండటంతో గ్రామస్తులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు తీవ్రభయ భ్రాంతులకు గురవుతున్నారు. చిన్నారులు వృద్ధులు ఇంటి నుంచి బయటకు రావాలంటే భయపడుతున్న పరిస్థితి నెలకొంది. అధికారులు ఇప్పటికైనా స్పందించి వీధి కుక్కల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఒడ్డె లింగాపూర్ గ్రామస్తులు కోరుతున్నారు.

30న ఆటోల బంద్: ఆటో డ్రైవర్ల జేఏసీ

హైదరాబాద్ సిటీ, నవంబరు 15 (ప్రజావినికిడి)::పెంచిన ఆటో మీటర్ చార్జీలను 15 రోజుల్లో అమలు చేయకుంటే రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాజీనామా చేయాలనే డిమాండ్‌తో... ఈ నెల 30న ఒక రోజు బంద్ నిర్వహిస్తున్నట్టు మహాత్మగాంధీ తెలంగాణ ఆటో డ్రైవర్స్ జేఏసీ పేర్కొంది. ఆదివారం హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో విలేకరుల సమావేశంలో జేఏసీ కన్వీనర్ మహ్మద్ అమానుల్లాఖాన్ మాట్లాడారు. గ్రీన్ క్యాబ్‌లను ప్రభుత్వం అనుమతించడం.. ఆటో, ట్యాక్సీ డ్రైవర్ల జీవితాలతో చెలగాటమాడడమే అన్నారు

డిజిటల్ అరెస్టు పేరుతో హడలెత్తించి.. 1.42 కోట్లు కొట్టేసిన సైబర్ నేరగాళ్లు

హైదరాబాద్ సిటీ, నవంబరు 15(ప్రజావినికిడి): : జెట్ ఎయిర్‌వేస్ వ్యవస్థాపకుడు నరేశ్ గోయల్‌ను అరెస్టు చేసినప్పుడు ఆయన వద్ద మీ ఏటీఎం కార్డు దొరికిందని డిజిటల్ అరెస్టు చేస్తున్నామంటూ హడలెత్తించి హైదరాబాద్‌కు చెందిన ఓ రిటైర్డు బ్యాంకు ఉద్యోగిని వద్ద సైబర్ నేరగాళ్లు రూ.1.42 కోట్లు కొట్టేశారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడకు చెందిన మహిళ (72) తెలంగాణ గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం చేసి రిటైర్ అయ్యారు. ఆ వృద్ధురాలి ఫోన్‌కు సెప్టెంబరు 10న కావ్యాగుప్తా అనే మహిళ ఫోన్ చేసింది. మీ మొబైల్ నెంబర్‌తో అనుసంధానమై ముంబై కెనరా బ్యాంకులో ఉన్న ఖాతా నుంచి విదేశాలకు డబ్బు వెళ్లిందని, దీనిపై ముంబై పోలీసులు కేసు నమోదు చేశారని, వారిని సంప్రదించాలని సూచించింది.

ఇంతలో వాట్సాప్‌కు వీడియో కాల్ వచ్చింది. పోలీసు దుస్తుల్లో వ్యక్తులు తాము ముంబై పోలీసులమంటూ వృద్ధురాలితో మాట్లాడారు. నరేశ్ గోయల్ వద్ద మీ ఏటీఎం కార్డు లభించందని, వివరణ ఇవ్వాలని, కేసు నమోదైందని వృద్ధురాలిని హడలెత్తించారు. విచారణ నిమిత్తం బ్యాంకు ఖాతాల్లోని డబ్బును ఆర్‌బీఐకి బదిలీ చేయాలని, వెరిఫికేషన్ అనంతరం డబ్బు వెనక్కి వస్తుందని నమ్మబలికారు. దీంతో ఆమె విడతల వారీగా రూ.1.42 కోట్లను వేర్వేరు ఖాతాలకు బదిలీ చేసింది. చివరకు మోసాన్ని గ్రహించిన వృద్ధురాలు పోలీసులను ఆశ్రయించారు.

అయ్యప్ప భక్తులకు శుభవార్త.. హైదరాబాద్, ఏపీ నుంచి ప్రత్యేక రైళ్లు

తెలుగు రాష్ట్రాల నుంచి కొల్లాంకు ప్రత్యేక రైళ్లు

చర్లపల్లి నుంచి నవంబర్ 20 నుంచి స్పెషల్ సర్వీసులు

డిసెంబర్ నుంచి హైదరాబాద్ - కొల్లాం ప్రత్యేక రైలు

మచిలీపట్నం నుంచి జనవరి వరకు కొల్లాం ఎక్స్‌ప్రెస్

రైల్వే లేదా ఐఆర్‌సీటీసీ ద్వారా రిజర్వేషన్ సదుపాయం





హైదరాబాద్ సిటీ, నవంబరు 15(ప్రజావినికిడి):

శబరిమల అయ్యప్ప స్వామి మండల, మకరవిళక్కు పూజల సీజన్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అయ్యప్ప భక్తులకు దక్షిణ మధ్య రైల్వే తీపి కబురు అందించింది. తెలుగు రాష్ట్రాల నుంచి కేరళలోని కొల్లాంకు భారీగా తరలివెళ్లే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్, చర్లపల్లి, మచిలీపట్నం ప్రాంతాల నుంచి కొల్లాం వరకు ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది.

చర్లపల్లి కొల్లాం ప్రత్యేక రైళ్లు (07180 / 07181)

చర్లపల్లి నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07180) నవంబర్ 20 నుంచి డిసెంబర్ 25 వరకు ప్రతి శుక్రవారం రాత్రి 11:45 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు ఉదయం 7:55 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం చర్లపల్లి స్పెషల్ రైలు (నంబర్ 07181) నవంబర్ 22 నుంచి డిసెంబర్ 27 వరకు ప్రతి ఆదివారం ఉదయం 10:40 గంటలకు కొల్లాంలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 7:00 గంటలకు చర్లపల్లికి చేరుకుంటుంది.

ఈ రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు మీదుగా ప్రయాణిస్తుంది. తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లోని పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం, కరుణాగపల్లి, శాస్తాంకోట తదితర కీలక స్టేషన్లలో ఈ రైలు ఆగుతుంది.

హైదరాబాద్ కొల్లాం ప్రత్యేక రైళ్లు (07193 / 07194)

హైదరాబాద్ నుంచి కొల్లాం వెళ్లే ప్రత్యేక రైలు (నంబర్ 07193) డిసెంబర్ 5 నుంచి డిసెంబర్ 26 వరకు ప్రతి శనివారం రాత్రి 11:10 గంటలకు బయలుదేరి, సోమవారం ఉదయం 7:15 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో కొల్లాం హైదరాబాద్ ప్రత్యేక రైలు (నంబర్ 07194) డిసెంబర్ 7 నుంచి డిసెంబర్ 28 వరకు ప్రతి సోమవారం ఉదయం 10:55 గంటలకు బయలుదేరి, మరుసటి రోజు సాయంత్రం 6:30 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది.

ఈ సర్వీసు సికింద్రాబాద్, చర్లపల్లి, నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, పిడుగురాళ్ల, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, నెల్లూరు స్టేషన్ల మీదుగా సాగుతుంది. అలాగే పెరంబూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేటై, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, పొదనూర్, పాలక్కాడ్, త్రిసూర్, అలువా, ఎర్నాకుళం టౌన్, కొట్టాయం, చంగనస్సేరి, తిరువల్ల, చెంగన్నూర్, మావేలికర, కాయంకుళం స్టేషన్లలో హాల్ట్ కల్పించారు.

మచిలీపట్నం కొల్లాం ప్రత్యేక రైళ్లు (08539 / 08540)

ఆంధ్రప్రదేశ్ నుంచి ప్రయాణించే భక్తుల కోసం మచిలీపట్నం కొల్లాం మధ్య మరో ప్రత్యేక రైలును అందుబాటులోకి తెచ్చారు. రైలు నంబర్ 08539 నవంబర్ 22 నుంచి జనవరి 24 వరకు ప్రతి ఆదివారం ఉదయం 9:20 గంటలకు మచిలీపట్నంలో బయలుదేరి, మరుసటి రోజు రాత్రి 9:30 గంటలకు కొల్లాం చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 08540 నవంబర్ 24 నుంచి జనవరి 26 వరకు ప్రతి మంగళవారం మధ్యాహ్నం 2:30 గంటలకు కొల్లాంలో బయలుదేరుతుంది. ఈ రైలు విజయనగరం, విశాఖపట్నం, రాజమండ్రి, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు మీదుగా కొల్లాం చేరుకుంటుంది.

శబరిమల యాత్రకు సిద్ధమవుతున్న భక్తులు ఈ ప్రత్యేక రైలు సర్వీసులను వినియోగించుకోవాలని రైల్వే వర్గాలు సూచించాయి. ప్రత్యేక రైళ్ల సమయాలు, సర్వీసుల నిర్వహణలో మార్పులు ఉండే అవకాశం ఉన్నందున, ప్రయాణికులు అధికారిక సమాచారం, టికెట్ బుకింగ్, బెర్తుల లభ్యత కోసం ఇండియన్ రైల్వేస్ లేదా ఐఆర్‌సీటీసీ (×=జుజ) వెబ్‌సైట్, యాప్‌ను పరిశీలించాలని అధికారులు స్పష్టం చేశారు.

హరీశ్ రావు తండ్రి సంవత్సరీకం.. హాజరైన కేసీఆర్, కేటీఆర్





బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన మేనల్లుడు హరీశ్ రావు నివాసానికి వెళ్లారు. హరీశ్ రావు తండ్రి దివంగత సత్యనారాయణరావు ప్రథమ వర్ధంతి (సంవత్సరీకం) సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.రంగారెడ్డి జిల్లా నార్సింగి సర్కిల్ పరిధిలోని కోకాపేటలో ఉన్న హరీశ్ రావు స్వగృహానికి కేసీఆర్ చేరుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన సత్యనారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. అనంతరం హరీశ్ రావుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను కేసీఆర్ పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా పాల్గొన్నారు. ఆయన దివంగత సత్యనారాయణరావు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి శ్రద్ధాంజలి అర్పించారు. వీరితో పాటు రాజ్యసభ మాజీ సభ్యుడు జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ కార్పొరేషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తదితర ముఖ్య నేతలు హాజరై హరీశ్ రావు కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పంచాయతీ నామినేషన్ల వేళ.. అన్నమయ్య జిల్లాలో ఘర్షణలు, పలువురికి గాయాలు



అన్నమయ్య జిల్లా, నవంబర్ 15:(ప్రజావినికిడి):
రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి.రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైన నేపథ్యంలో అన్నమయ్య జిల్లాలో ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జిల్లాలోని రామాపురం మండలంలోని హసనాపురంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు తలెత్తాయి. సిబ్బాల గ్రామ పంచాయతీకి సంబంధించి.. నామినేషన్లు కొనసాగుతున్న వేళ.. ఇరు వర్గాలు కొట్టుకోవడంతో పలువురికి గాయాలయ్యాయి. అప్రమత్తమైన పోలీసులు.. రంగప్రవేశం చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చి.. నామినేషన్ల ప్రక్రియను యథాతథంగా పూర్తి చేయించారు.

రాష్ట్ర స్థాయి గోవిజ్ఞాన పరీక్షలో షాద్‌నగర్ విద్యార్థిని ప్రతిభ

తృతీయ బహుమతి సాధించిన ఠాగూర్ పాఠశాల విద్యార్థిని అవంతిక..

రూ.25 వేల నగదు బహుమతి

కేంద్రమంత్రి బండి సంజయ్ చేతుల మీదుగా పురస్కారం అందజేత



షాద్ నగర్.(ప్రజావినికిడి):
రాష్ట్ర స్థాయి గోవిజ్ఞాన పరీక్షల్లో షాద్‌నగర్ పట్టణానికి చెందిన విద్యార్థిని అవంతిక ప్రతిభ చాటింది. గోసేవ విభాగం తెలంగాణ ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లోని నారాయణగూడ కేశవ మెమోరియల్ కాలేజీలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గోవిజ్ఞాన పరీక్షలు-2026లో షాద్‌నగర్ ఠాగూర్ పాఠశాలకు చెందిన అవంతిక తృతీయ స్థానంలో నిలిచి బహుమతి సాధించింది.రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2,001 మంది విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అవంతికకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చేతుల మీదుగా రూ. 25 వేల నగదు చెక్కుతో పాటు జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి విద్యార్థినిని అభినందించారు.
ఈ పరీక్షల్లో షాద్‌నగర్ పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నగా, నిర్వాహకులు వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో గోసేవ షాద్‌నగర్ ఇన్‌చార్జి సుభాష్ రెడ్డి, ఉపాధ్యాయులు అర్మాల్ రవి ప్రకాష్,వీరేష్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి సాధించిన అవంతికను ఠాగూర్ పాఠశాల చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ప్రిన్సిపాల్ అంజలి దేవి, ఉపాధ్యాయ బృందం ప్రత్యేకంగా అభినందించారు.

ఏపీకి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవం - యాక్సెస్ ఈక్వాలిటీలో నెం.2



అమరావతి,(ప్రజావినికిడి): :సంపదలోనే కాదు సామాన్యుడికి అందే అవకాశాల్లోనూ ఆంధ్రప్రదేశ్ సత్తా చాటుతోంది. ప్రజలకు సేవలు, సౌకర్యాలు అందించడంలో టాప్‌గా నిలిచింది. దేశవ్యా ప్తంగా యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్‌లో రెండో ర్యాంక్‌తో రాష్ట్రం సరికొత్త రికార్డు సృష్టించింది. సామాజిక, ఆర్థిక భద్రతలో దేశంలోనే అగ్రగామిగా నిలిచి అభివృద్ధికి కేరాఫ్‌గా మారింది.ఆర్థిక పరిస్థితులను విశ్లేషించి : అభివృద్ధి అంటే కేవలం సంపద సృష్టి మాత్రమే కాదు ఆ సంపదను ప్రజలకు అందుబాటులో ఉన్న అవకాశాలుగా మలచాలి. ఈ అంశం ప్రాతిపదికగా ఓ.పీ. జిందాల్ గ్లోబల్ యూనివర్సిటీకి చెందిన సెంటర్ ఫర్ న్యూ ఎకనామిక్ స్టడీస్ రూపొందించిన యాక్సెస్ ఈక్వాలిటీ ఇండెక్స్ ఏఈఐ-2026లో ఏపీ మెరుగైన పనితీరు కనబర్చింది. దేశంలోని 28 రాష్ట్రాల సామాజిక, ఆర్థిక పరిస్థితులను విశ్లేషించి నివేదికను రూపొందించారు. రిపోర్ట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు 0.66 స్కోరు లభించింది. 0.68 స్కోరుతో గోవా తొలి స్థానంలో నిలవగా సిక్కిం 0.63, కేరళ 0.60, తమిళనాడు, తెలంగాణ 0.57 స్కోర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.ఐదు కీలక అంశాలు పరిగణనలోకి : ఈ సూచీ ఆధారంగా ఏపీని ఫ్రంట్ రన్నర్ రాష్ట్రంగా సీఎన్ఇఎస్ గుర్తించింది. రాష్ట్రాల అభివృద్ధిని అంచనా వేయడంలో ఈ సూచీ ఐదు కీలక అంశాలను పరిగణనలోకి తీసుకుంది. ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక-ఆర్థిక భద్రత, న్యాయ సేవల ఆధారంగా రాష్ట్రాల పనితీరును విశ్లేషించింది. ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య సంరక్షణ, విద్య, సామాజిక-ఆర్థిక మొత్తం 23 విభాగాల్లోని 60 సూచికలను పరిశీలించి ప్రతి అంశానికి సమాన ప్రాధాన్యం ఇచ్చింది. ఈ ఐదు అంశాల్లో సామాజిక, ఆర్థిక భద్రత విభాగంలో ఆంధ్రప్రదేశ్ 0.69 స్కోరుతో దేశంలోనే అగ్రస్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఉన్న గోవా 0.50 స్కోరుకే పరిమితమైంది. మిగిలిన నాలుగు విభాగాల్లోనూ ఏపీ అగ్రరాష్ట్రాల జాబితాలో చోటు దక్కించుకుంది.దేశంలో 13వ స్థానంలో ఆంధ్రప్రదేశ్ : తలసరి ఆదాయంలో ఆంధ్రప్రదేశ్ దేశంలో 13వ స్థానంలో ఉన్నప్పటికీ ఆర్థిక స్థాయిని బట్టి అంచనా వేసిన యాక్సెస్ స్కోరు 0.51 మాత్రమే. ఐతే అంచనాలకు మించి 0.15 పాయింట్లు అధికంగా రాష్ట్రం నమోదు చేసింది.ప్రాథమిక మౌలిక సదుపాయాలు, ఆరోగ్య ఆదాయానికి, అవకాశాల కల్పనకు మధ్య ఉన్న ఈ సానుకూల వ్యత్యాసం దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ఏపీలోనే అత్యధికంగా నమోదైంది. కేరళ 0.07, హిమాచల్ ప్రదేశ్ 0.06 పాయింట్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ప్రజలకు అవసరమైన సేవలు, సౌకర్యాలు ఎంతమేర అందుబాటులో ఉన్నాయన్నదే ఈ సూచీ ప్రధాన ఉద్దేశం. తాగునీరు, పారిశుద్ధ్యం, గృహవసతి, స్వచ్ఛమైన ఇంధనం, వైద్య సదుపాయాలు, విద్య, ఉపాధి, బ్యాంకింగ్, బీమా, పింఛన్లు, న్యాయ సేవల లభ్యతను ఇందులో పరిశీలించారు.

స్థానిక సంస్థల రెండో విడత ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యం: ఏపీ బీజేపీ చీఫ్



అమరావతి, నవంబర్15:
స్థానిక సంస్థల రెండో విడత ఎన్నికల్లో కూటమి విజయమే లక్ష్యమని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్పష్టం చేశారు. గతంలో సాధించిన విజయా లను పునరావృతం చేసేలా ఈ ఎన్నికలకు నమాయత్తమవుతున్నామని తెలిపారు. ఆదివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. 2024 అసెంబ్లీ ఎన్నికలతో పాటు ఇటీవల జరిగిన స్థానిక సంస్థల ఎన్ని కల్లో కూటమికి ప్రజలు మద్దతు ఇచ్చారని అన్నారు. ఈ మద్దతు ఈసారి కూడా కొనసాగుతోందని విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాలనపై ప్రజల్లో సానుకూల స్పందన తోపాటు విశ్వాసం కూడా పెరుగుతుందని పేర్కొన్నారు.రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పీవీఎన్ మాధవ్ చెప్పారు. అన్ని ప్రాంతాల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నేతల సమన్వయంతో అభ్యర్థుల ఎంపిక, సీట్ల పంపకాలపై చర్చలు జరిపామని వివరించారు. పంచాయతీ ఎన్నికల మొదటి విడతకు కూడా ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైందని అన్నారు. జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలతో కలిసి క్షేత్రస్థాయిలో సమన్వయంతో పనిచేయాలని నిర్ణయించామని తెలిపారు. సంక్షేమం, అభివృద్ధి అనే రెండు అంశాలకు సమాన ప్రాధాన్యతను ఇస్తూ డబుల్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ ధీమా వ్యక్తం చేశారు.

అనకాపల్లి జిల్లాలో ముగ్గురి యువకుల మృతి హోం మంత్రి అనిత విచారం



అనకాపల్లి జిలాప్రజావినికిడి):
అనకాపల్లి జిల్లా ఎస్.రాయవరం మండలం పెనుగొల్లులోని వరాహ నదిలో స్నానానికి దిగి ముగ్గురు యువకులు గల్లంతై, మృతి చెందిన విషయం తెలిసిందే. (ఆదివారం) ఉదయం యువకుల మృతదేహాలు లభ్యమయ్యా యి. యువకుల మృతిపై ఆంధ్రప్రదేశ్ హోం మంత్రి వంగలపూడి అనిత విచారం వ్యక్తం చేశారు. శనివారం ఈతకు వెళ్లి వరాహ నదిలో యువకులు గల్లంతై, చనిపోయారని తెలిపారు. నిన్న సాయంత్రం నుంచి పోలీసులు, గ్రామస్థుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు కొనసాగాయని చెప్పుకొచ్చారు. యువకులు మృతిచెందడం అత్యంత బాధాకరమని అన్నారు. మృతుల కుటుంబాలకు హోం మంత్రి అనిత ప్రగాఢ సానుభూతి తెలిపారు.కాగా, యువకుల మృతి పట్ల బాధిత కుటుంబాలకు ప్రభుత్వం న్యాయం చేయాలని కోరుతూ వారి బంధువులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. వారి నిరసనతో పెనుగల్లు జాతీయ రహదారిపై కిలోమీటర్ల మేర వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

గ్రామస్థాయిలోనూ కూటమి బలపరిచే అభ్యర్థులనే గెలిపించాలి



అమరావతి,(ప్రజావినికిడి): :గ్రామస్థాయి ఎన్నికలను నాయకులు తేలిగ్గా తీసుకోవద్దని పార్టీ నేతలకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పంచాయ తీలతో పాటు 23 పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై టీడీపీ ముఖ్యనేతలతో శనివారం చంద్రబాబు టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. క్షేత్రస్థాయిలో నేతల్ని తీర్చిదిద్దేందుకు ఈ ఎన్నికలు మంచి అవకాశమని సీఎం అన్నారు. కేంద్రం, రాష్ట్రం, పురపాలికలు, జిల్లా పరిషత్తుల్లో ఎన్డీయేనే ఉందని అన్నారు. పట్టణ, పరిషత్ ఎన్నికల్లో కూటమికి చారిత్రక విజయాన్ని ఇచ్చినట్లే, కూటమి బలపరిచే అభ్యర్థులనే సర్పంచులుగా గెలిపించాలని సీఎం చంద్రబాబు కోరారు. గ్రామస్థాయిలోనూ కూటమి బలపరిచే అభ్యర్థులు గెలవాలన్నారు. అప్పుడే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు సజావుగా సాగుతాయని చంద్రబాబు స్పష్టం చేశారు. నాలుగు నగరపాలక సంస్థలు, 19 పురపాలక సంఘాలు, నగర పంచాయతీలకు జరిగే ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలని దిశానిర్దేశం చేశారు.పుర, పరిషత్తు ఎన్నికల్లో కూటమికి ప్రజలు చరిత్రాత్మక విజయాన్ని కట్టబెట్టారని చంద్రబాబు పేర్కొన్నారు. 94 మున్సిపాలిటీలు, 3235 వార్డులు, 575 జడ్పీటీసీలు, 7,500కు పైగా ఎంపీటీసీ స్థానాల్లో కూటమి బలపరిచిన అభ్యర్థులు విజయభేరి మోగించారన్నారు. ఈవీఎం, బ్యాలెట్, పోస్టల్ బ్యాలెట్ ఇలా ఏ విధానమైనా కూటమిదే హవా అని చంద్రబాబు స్పష్టం చేశారు. “గతం కంటే 25 శాతం ఓటు బ్యాంకు పెరిగింది. ఉద్యోగులంతా కూటమి ప్రభుత్వం వైపే నిలబడ్డారు. సుమారు 7 జిల్లాల్లో క్లీన్‌స్వీప్ చేశాం. అనకాపల్లి, మార్కాపురం జిల్లాల్లో 100 శాతం స్ట్రైక్‌రేట్ సాధించాం” అని చంద్రబాబు తెలిపారు. వైఎస్సార్సీపీ చేసిన తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మలేదన్నారు.గొడవలకు పోవద్దని సూచన: త్వరలో జరిగే 23 పట్టణ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులు తిరుగులేని విజయం సాధించాలన్నారు. స్థానిక ఎన్నికల్లో విద్యావంతులు, యువతకు అవకాశంమిచ్చామని గుర్తుచేశారు. ప్రజల మనోభావాల ప్రకారం పని చేయాలని, ఎట్టి పరిస్థితుల్లో చెడ్డ పేరు తెచ్చుకోవద్దని సూచించారు. గొడవలకు పోవొద్దన్న చంద్రబాబు కొందరు హింసనే నమ్ముకుంటారని, కూటమి మాత్రం ప్రజాస్వామ్యాన్ని నమ్ముతుందని అన్నారు. అధికారాన్ని మంచి చేయడానికి, ప్రజలకు దగ్గర కావడానికి ఉపయోగించుకోవాలని నిర్దేశించారు.ప్రజల మనోభావాలకు తగ్గట్లు పనిచేస్తే: తమ మనోభావాలకు తగ్గట్టు పనిచేసే నాయకులతో ప్రజలు ఉంటారని చంద్రబాబు తెలిపారు. మంచి చేయడానికి, ప్రజలకు దగ్గరవడానికి అధికారాన్ని ఉపయోగించాలని అన్నారు. ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో గెలిచినవారు క్రియాశీలకంగా పనిచేయాలన్నారు. రాబోయే 30 ఏళ్లకు ఉపయోగపడేలా నాయకత్వాన్ని నిర్మించుకుందాం అని చంద్రబాబు శ్రేణులకు దిశానిర్దేశం చేశారు.

‘తుపాన్లతో 4.61 లక్షల హెక్టార్లలో పంట నష్టం’ – వివరాలు వెంటనే నమోదు చేయాలి



అమరావతి:అర్నబ్, మురసు తుపాన్ల వల్ల దెబ్బతిన్న పంట నష్టాల నమోదును వేగవంతం చేయాలని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నా యుడు అధికారులను ఆదేశించారు. అర్హులైన ఒక్క రైతు కూడా మిగిలిపోకుండా ఎన్యుమ రేషన్ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రెండు తుపాన్ల ప్రభావంతో రాష్ట్రంలో మొత్తం 4,61,194 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రికి వివరించారు.అర్నబ్ తుపానుతో భారీ నష్టం : అర్నబ్ తుపానుతో 3,27,843 హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 5,23,136 మంది రైతులపై ప్రభావం పడింది. ఈ తుపాను వల్ల వ్యవసాయ పంటలకు ఏకంగా రూ. 2,392.84 కోట్ల నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. మురసు తుపానుతో 1,33,351 హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నాయి. 1,86,269 మంది రైతులపై ప్రభావం పడింది. 29,960 హెక్టార్లలో నష్టం : రెండు తుపాన్లతో కలిపి 29,960 హెక్టార్లలో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. అర్నబ్ తుపాను ఉద్యాన పంటల నష్టాల ఎన్యుమరేషన్ 99.24 శాతం పూర్తయింది. కానీ, మురసు తుపాను నష్టాల నమోదు మాత్రం 32.77 శాతమే పూర్తయిందని అధికారులు తెలిపారు. దీనిపై మంత్రి అసంతృప్తి వ్యక్తం చేశారు.మురసు నష్టాల నమోదును వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత ఉంటే వెంటనే భర్తీ చేసి, నష్టపోయిన ప్రతి రైతును గుర్తించాలని సూచించారు. నష్టాల నమోదు పూర్తయిన వెంటనే పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని అచ్చెన్నాయుడు హామీ ఇచ్చారు.

స్థానిక ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేకనే మాపై జగన్ అండ్ కో అసత్య ఆరోపణలు




నంద్యాల జిల్లా , నవంబరు 15 :
వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డిపై ఏపీ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి (తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటమిని అంగీకరించలేక కూటమి ప్రభుత్వంపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. జగన్ అండ్ కో ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజల్లో గందరగోళం సృష్టి ంచడాన్ని ఇప్పటికైనా మానుకోవాలని మంత్రి హితవు పలికారు. వైసీపీ నుంచి పోటీ చేసేం దుకు కనీసం అభ్యర్థులు కూడా ముందుకు రాని పరిస్థితి ఉందని ఎద్దేవా చేశారు.స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం..పంచాయతీ ఎన్నికలపై వైసీపీ నేతలు చేస్తున్న అసత్య ప్రచారాలను మంత్రి తీవ్రంగా ఖండించారు. (ఆదివారం) నంద్యాల జిల్లాలోని కొలిమిగుండ్లలో మండల ఎన్డీఏ కూటమి ముఖ్య నాయకులతో పంచాయతీ ఎన్నికల సన్నద్ధతపై మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కేడర్‌కు స్థానిక ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. గ్రామస్థాయిలో కూటమి పార్టీల మధ్య సమన్వయం, ఎన్నికల కార్యాచరణపై నాయకులకు మార్గనిర్దేశం చేశారు. కూటమి నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేస్తూ పంచాయతీ ఎన్నికలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయం..మున్సిపల్, పరిషత్ ఎన్నికల్లో సాధించిన అఖండ విజయాన్ని పంచాయతీ ఎన్నికల్లోనూ పునరావృతం చేస్తామని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. పంచాయతీ ఎన్నికల్లోనూ కూటమి అభ్యర్థులదే విజయమని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికల ప్రక్రియపై ప్రజల్లో భయాందోళనలు సృష్టించేందుకు వైసీపీ ప్రయత్నిస్తోందని దుయ్యబట్టారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక

ఈసారి ఓటర్లు పెరిగారు - 6 లక్షలకు చేరుకున్న ఎమ్మెల్సీ ఓటు దరఖాస్తులు

హైదరాబాద్: రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాలకు ఎమ్మెల్సీల ఎన్నిక ప్రక్రియ ఊపందుకుంది. రెండు నెలల క్రితం ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మొన్నటి వరకు 2.5 లక్షలుగా ఉన్న దరఖాస్తులు రెండు వారాల్లోనే 6 లక్షలకు చేరుకున్నాయి. కాగా ఎన్నికల అధికారులు దీనిపై ముమ్మరంగా ప్రచారం చేశారు. మరికొన్ని రోజుల్లో తుది జాబితా విడదల అవ్వనుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ఎమ్మెల్సీ పదవికాలం మార్చి 29, 2027న ముగియనుంది. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి సారించాయి.తుది జాబితా విడుదల అప్పుడే!రాష్ట్ర ఎన్నికల సంఘం ఈ నెల 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటించనుంది. తుది ఓటర్ల జాబితాను డిసెంబర్ 30న ముద్రిస్తారు. ఎన్నికల షెడ్యూల్‌ను జనవరి మొదటి వారంలో విడుదల చేయనున్నట్లు సమాచారం. తుది ఓటర్ల జాబితా తర్వాత దరఖాస్తులను పరిశీలించి, ఆమోదించిన దరఖాస్తులతో మరో రెండు అనుబంధ ఓటర్ల జాబితాలను సిద్ధం చేస్తారని అధికారులు చెబుతున్నారు.రికార్డు స్థాయిలో ఓటరు నమోదుగత ఎన్నికల్లో మూడు ఉమ్మడి జిల్లాల్లో అంటే ప్రస్తుత 9 జిల్లాల్లో 156 మండలాల నుంచి 5 లక్షల మంది ఓటర్లుగా నమోదు



చేసుకున్నారు. ఇప్పుడు ఓటర్ల జాబితాలో అదనంగా లక్ష నుంచి రెండు లక్షల మంది చేరే సూచనలు ఉన్నాయని రాజకీయ పార్టీలు అంచనా వేస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారులు ఓటరు నమోదు దరఖాస్తులపై నిఘాను పెంచారు. 6 లక్షల దరఖాస్తుల్లో ఇప్పటి వరకు కేవలం 2,57,309 దరఖాస్తులు మాత్రమే ఆమోదించారు. 6,330 దరఖాస్తులు తిరస్కరించగా, 3.35 లక్షలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది.అప్పుడు కూడా దరఖాస్తు చేసుకోవచ్చుఈ నెల 6 వరకు అందిన దరఖాస్తులను పరిశీలించి, 25వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ప్రకటించనున్నట్లు సుదర్శన్ రెడ్డి ఇటీవల తెలిపారు. ముసాయిదా జాబితా ప్రచురించిన తర్వాత ఈ నెల 25 నుంచి డిసెంబరు 10 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల సమయంలో కూడా దరఖాస్తు చేసుకోవచ్చునని వెల్లడించారు. అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి వచ్చే నెల 30న పట్టభద్రుల ఓటర్ల తుది జాబితా ప్రచురిస్తామన్నారు. తుది జాబితా ప్రకటించిన తర్వాత నామినేషన్ల గడువు చివరి రోజు వరకు కూడా గ్రాడ్యుయేట్లు ఓటు కోసం దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని సీఈవో సుదర్శన్ రెడ్డి వివరించారు.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి బీజేపీ, కాంగ్రెస్? పార్టీలు వారి అభ్యర్థులను ఇదివరకే ఎంపిక చేశాయి. బీఆర్?ఎస్? నుంచి ఇంకా ఎవరినీ బరిలో నిలపలేదు. బీజేపీ నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడైన ఎన్?.రాంచందర్?రావును ఖరారు చేసినట్లు తెలిసింది. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ బీజేపీ అభ్యర్థిగా ఆయనను ఎంపిక చేసినట్లు సమాచారం. మరికొన్ని రోజుల్లో ఆయన పేరును పార్టీ అధికారికంగా ప్రకటించనుంది.

సజ్జనార్ ఆస్తుల కొనుగోళ్లపై విచారణ జరిపించాలి



హైదరాబాద్,(ప్రజావినికిడి): తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ లేఖ రాశారు. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసుపై కీలక విషయాలను ప్రస్తావించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వెలుగులోకి వచ్చిన ఫోన్ ట్యాపింగ్ కుంభకోణంలో పలువురు ప్రముఖ రాజకీయ నాయకులు, వీఐపీలు, ఇతర కీలక వ్యక్తుల ఫోన్లపై నిఘా పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొన్నారు.ఈ కేసులో ఎఫ్ఐఆర్ నమోదు కావడంతో పాటు, సజ్జనార్, రామకృష్ణారావు సహా పలువురు ఉన్నతాధికారుల ప్రమేయంపై ఆరోపణలు వచ్చినప్పటికీ, దర్యాప్తు పురోగతి, దాని దిశపై ఇంకా అనేక ప్రశ్నలు మిగిలే ఉన్నాయని రాజాసింగ్ చెప్పుకొచ్చారు. ఈ దర్యాప్తు అసలు లక్ష్యం నుంచి పక్కదారి పట్టిందనే తీవ్రమైన ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. అప్పటి పోలీస్ కమిషనర్ సజ్జనార్ పాత్రపైనా, ఈ కేసులోని అన్ని అంశాలపై నిష్పక్షపాతంగా దర్యాప్తు జరిగిందా..? లేదా అన్నదానిపైనా అనేక ఆరోపణలు, ప్రశ్నలు తలెత్తుతున్నాయని చెప్పారు. అనుమానాలకు తావివ్వకుండా ఈ అంశాలపై స్వతంత్రంగా, పారదర్శకంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందని తెలిపారు.

బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం



హైదరాబాద్, నవంబర్10: రాష్ట్రంలో బాయిలర్ల నిర్వహణపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బాయిలర్ల సర్టిఫికెట్ల గడువు మరో మూడు నెలలు పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు మంగళవారం తెలంగాణ ప్రభుత్వం జీవో నంబర్ 465 జారీ చేసింది. కేంద్ర ప్రభుత్వ సూచనల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆ ఉత్తర్వుల్లో రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలతో ఇంధన సరఫరాపై తీవ్ర ప్రభావం చూపిందని వివరించింది. దీంతో ఇంధన వినియోగాన్ని సమర్థంగా నిర్వహించేందుకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నట్లు తెలిపింది.100 టన్నులు, అంతకంటే ఎక్కువ సామర్థ్యం ఉన్న బాయిలర్లకు ఈ వెసులుబాటు వర్తిస్తుందని పేర్కొంది. తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో విద్యుత్ కేంద్రాలు, చమురు, గ్యాస్ పరిశ్రమలకు ఊరట కలిగిస్తుంది. అలాగే పెట్రోలియం రిఫైనరీలు, పెట్రోకెమికల్‌తోపాటు ఎరువుల పరిశ్రమలకు వెసులుబాటు కల్పిస్తుంది. 2026, నవంబర్ 30వ తేదీ వరకు మాత్రమే గతంలో విడుదల చేసిన నోటిఫికేషన్ అమలు కానుంది. ఆరు నెలల్లో సర్టిఫికెట్ గడువు ముగిసే బాయిలర్లకు మూడు నెలల పొడిగింపు ఇచ్చింది. భద్రతా ప్రమాణాలు, సాంకేతిక తనిఖీలు మాత్రం తప్పనిసరి అని జారీ చేసిన జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది.

అక్రమ అండాల సేకరణ వ్యవహారంలో దర్యాప్తు ముమ్మరం - ఒక్కో మహిళకు రూ.65 వేలు!

హైదరాబాద్: అండాల సేకరణ అక్రమ వ్యవహారంలో పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌వోల ఫిర్యాదుల మేరకు జూబ్లీహిల్స్, ఫిల్మ్‌నగర్, మియాపూర్, మహంకాళి, మలక్‌పేట పోలీసు స్టేషన్లలో 5 ఐఎఫ్ఆర్‌లు నమోదు చేశారు. ఒయాసిస్ ఫెర్టిలిటీ క్లినిక్స్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి మహిళలను హైదరాబాద్‌కు తీసుకొచ్చి అండాల దానానికి ప్రలోభపెట్టినట్లు విచారణలో గుర్తించారు.ఒక్కో మహిళకు రూ.30 వేల ఇస్తామని ఆశ చూపి ఈ ప్రక్రియకు ఒప్పించినట్లు ఆరోపణ లున్నాయి. అంతేకాకుండా వైద్యుల పర్యవేక్షణ లేకుండానే మహిళలకు హార్మోన్ ఇంజెక్షన్లు ఇచ్చినట్లు అధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో మహిళలను తీసుకొచ్చే ఫెసిలిటేటర్లతోనూ ప్రత్యేక ఒప్పందాలు చేసుకున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఒక్కో మహిళను తీసుకొస్తే రూ.65



వేల వరకు చెల్లించేలా ఒప్పందాలు చేసుకోగా అండాల సంఖ్య, నాణ్యత తగ్గితే ఫెసిలిటేటర్లకు చెల్లించాల్సిన మొత్తంలో 50 శాతం కోత విధించేలా నిబంధనలు పెట్టినట్లు గుర్తించారు. మొత్తం 66 మంది మహిళల నుంచి అండాల సేకరణ చేసినట్లుగా తెలుస్తున్నా, అధికారులకు మాత్రం 47 మంది మహిళలకు సంబంధించిన రికార్డులే లభించాయి. మిగిలిన 19 మంది మహిళల వివరాలను ఏఆర్‌టీ బ్యాంక్ దాచిపెట్టినట్లు దర్యాప్తులో తేలింది. ఇప్పటికే ఈ వ్యవహారంలో మల్కాజిగిరి పోలీసులు మూడు కేసులు నమోదు చేసి, ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశారు. భారతీయ న్యాయ సంహితతోపాటు ఏఆర్‌టీ చట్టం కింద కేసులు నమోదు చేశారు. తాజాగా మరో ఐదు కేసులు నమోదుకావడంతో ఈ అక్రమ దందాలో మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశముంది. పరారీలో ఉన్న ఇతర నిందితుల కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.క్రమ అండాల సేకరణ వ్యవహారాన్ని తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ అత్యంత తీవ్రంగా పరిగణిస్తూ విచారణను కొనసాగిస్తోంది. ఈ నేపథ్యంలో శుక్రవారం మహిళా కమిషన్ ఎదుట హాజరుకావాలని 8 ఏఆర్‌టీ కేంద్రాలు, అండాల బ్యాంకులకు నోటీసులు జారీ చేయగా, ఆయా సంస్థల ప్రతినిధులు విచారణకు హాజరయ్యారు. ఆ సంస్థల యాజమాన్యాలు స్వయంగా విచారణకు హాజరు కావాలని కమిషన్ స్పష్టంగా ఆదేశించినప్పటికీ, కొన్ని కేంద్రాల నుంచి కేవలం ప్రతినిధులు, సిబ్బంది మాత్రమే హాజరుకావడంపై ఛైర్?పర్సన్ నేరెళ్ల శారద తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తదుపరి విచారణ తేదీన తప్పనిసరిగా యాజమాన్యాలు వ్యక్తిగతంగా హాజరవుతామని హామీ ఇవ్వడంతో విచారణను వాయిదా వేశారు.శుక్రవారం విచారణలో ఆయా ఏఆర్‌టీ కేంద్రాలు, అండాల బ్యాంకులు సమర్పించిన నివేదికలు, రికార్డులు, డోనర్ల వివరాలను కమిషన్ క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ సందర్భంగా డోనర్ల వివరాల్లో పలు అవకతవకలు, అనుమానాస్పద అంశాలు వెలుగులోకి వచ్చినట్లు ఛైర్?పర్సన్? తెలిపారు. సమర్పించిన వివరాల ప్రకారం సుమారు 90 శాతం మంది డోనర్లు ఇతర రాష్ట్రాలకు చెందినవారని ఛైర్‌పర్సన్ నేరెళ్ల శారద పేర్కొన్నారు. అండాల దానం చేయడానికి వస్తున్నారని ఆయ ఏఆర్?టీ కేంద్రాలు, అండాల బ్యాంకులు పేర్కొనడం ఆశ్చర్యకరం కలిగించడమే కాకుండా అనేక అనుమానాలకు తావిస్తోందని శారద తెలిపారు.

ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం! - ఈగల్ డీఎస్పీ

హైదరాబాద్ (ప్రజావినికిడి):: హైదరాబాద్‌లో యువత, టీనేజర్లను లక్ష్యంగా చేసుకొని సాగుతున్న నిషేధిత ఈ-సిగరెట్ల అక్రమ దందాపై ఈగల్ ఫోర్స్ ఉక్కుపాదం మోపుతోంది. రాయ దుర్గంలోని ఓ అవుట్‌లెట్‌పై దాడిచేసి భారీగా నిషేధిత వేప్స్, విదేశీ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. పన్నులు ఎగ్గొట్టి చైనా నుంచి అక్రమంగా దిగుమతి చేసుకుంటూ ర్యాపిడో, ఉబర్, ఓలా వంటి యాప్‌ల ద్వారా గుట్టుచప్పుడు కాకుండా డెలివరీ చేస్తున్నట్లు గుర్తించా మని ఈగల్ డీఎస్పీ మధు మోహన్?రెడ్డి తెలిపారు. ఈ అక్రమ దందాపై ఈటీవీ భారత్ ముఖాముఖిలో అనేక వివరాలు వెల్లడించారు. 2019 లో కేంద్ర ప్రభుత్వం వేప్స్, ఈ-సిగరెట్లపై నిషేధం విధించింది. ఈజీ మనీ కోసం కొంతమంది వ్యక్తులు వీటిని చైనా నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. గచ్చిబౌలి, మాదాపూర్,



రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో కేరళంకు చెందిన వ్యక్తులు కూల్?డ్రింక్?లు, పెర్?ఫ్యూమ్? షాపుల మాటున వేప్స్, ఈ-సిగరెట్ల దందా పకడ్బందీగా నడుపుతున్నట్లుగా గుర్తించాం. ఆయా షాపులకు సంబంధించి ప్రత్యేక వాట్సప్? గ్రూప్?ను క్రియేట్? చేసుకొని, ఆ గ్రూపులో కస్టమర్లను యాడ్? చేసుకుంటున్నారు. వేప్స్, ఈ-సిగరెట్ల కొత్త స్టాక్? వివరాలు ఆ గ్రూప్?లో పోస్ట్ చేస్తారు. రోజుకో ఫ్లేవర్? ఉందంటూ ఆ గ్రూప్?లో ఎక్కువగా ఉన్న టీనేజర్లను ఆకర్షిస్తున్నారు. కొన్ని షాపులోనే అమ్మకాలు చేస్తుండగా, మరికొన్ని వాట్సప్ ద్వారా ఆర్డర్ తీసుకుని కస్టమర్ లొకేషన్‌కు పోర్టర్ ద్వారా, ర్యాపిడో, ఉబర్ ద్వారా డోర్ డెలివరీ చేస్తున్నట్లు తెలిసింది. పన్నులు చెల్లించకుండా అక్రమమార్గంలో దందా చేస్తున్నారు. మామూలు సిగరెట్ కంటే నాలుగు రెట్ల హానికరమైన నికోటిన్ కలిగి ఉండే ఈ-సిగరెట్ల వల్ల యువత ఆరోగ్యానికెందిన వారు ఎక్కువగా దుబాయిలో ఉంటారు.విస్తరించి ఉన్నట్లుగా తెలుస్తోంది. ఎలాంటి టాక్స్? లేకుండా అక్రమ వ్యాపారం జరుగుతోంది. ఆ బ్యాంకు అకౌంట్లను ఫ్రీజ్? చేస్తున్నాం. ఈ దందా చేసే వారిపై దృష్టి పెడుతున్నాం.

కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌కు ఈడీ షాక్.. రూ.18.33 కోట్ల ఆస్తులు అటాచ్

హైదరాబాద్, (ప్రజావినికిడి):



కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ కేసులో ఈడీ అధికారులు చర్యలు చేపట్టారు. కల్లం పేరిరెడ్డి, కుటుంబ సభ్యులు, అనుచరుల ఆస్తులపై కొరడా ఝుళిపించారు. రూ.18.33 కోట్ల విలువైన స్థిరాస్తులను ఈడీ అధికారులు అటాచ్ చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని ఆస్తులను జప్తు చేశారు. బ్యాంకు రుణాల మోసం కేసులో మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద చర్యలు తీసుకున్నారు. 2010 – 2013 మధ్య ఎస్‌బీహెచ్ నుంచి రూ.24.57 కోట్ల రుణాలను ఈ గ్రూపు సంస్థలు పొందిన విషయం తెలిసిందే. నకిలీ, ఫోర్జరీ ఆస్తిపత్రాలను తనఖాగా కల్లం మోడ్రన్ రైస్ మిల్స్ పెట్టి రుణాలు పొందినట్లు ఈడీ అధికారులు గుర్తించారు.బ్యాంకుకు రూ.18.33 కోట్ల నష్టం కలిగించినట్లు కల్లం మోడ్రన్ రైస్ మిల్స్‌పై ఆరోపణలు ఉన్నాయి. కల్లం మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ రామబ్రహ్మ మోడ్రన్ రైస్ మిల్స్, శ్రీ వినాయక ట్రేడర్స్ పేరుతో రుణాలు తీసుకున్నట్లు ఈడీ అధికారుల దర్యాప్తులో తేలింది. బంధువులు, ఉద్యోగులు, అనుచరుల పేర్లతో సుమారు 26 సంస్థలను నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. మూడు సంస్థల క్యాష్ క్రెడిట్ ఖాతాల నుంచి రూ.23.81 కోట్ల నగదును ఉపసంహరించినట్లు ఈడీ దర్యాప్తులో తేలింది. కార్మికులు, అకౌంటెంట్లు, కల్లం పేరిరెడ్డి పేర్లతో నగదు విత్‌డ్రా చేసినట్లు గుర్తించారు. రుణాల సొమ్ముతోనే పలు స్థిరాస్తులను కొనుగోళ్లు చేసినట్లు దర్యాప్తులో ఈడీ అధికారులు వెల్లడించారు. బంధువులు, అనుచరుల పేర్లకు ఎలాంటి నగదు చెల్లించకుండానే ఆస్తులను బదిలీ చేసినట్లు తెలిపారు.

ఏపీలో తెలంగాణ ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతుకు రోడ్డు ప్రమాదం



నెల్లూరు జిల్లా :తెలంగాణ రెవెన్యూ, స్టాంప్‌లు, రిజిస్ట్రేషన్ల శాఖ ఐజీ, 2012 బ్యాచ్ ఐపీఎస్ అధికారి రాజీవ్ హనుమంతు ప్రయాణిస్తున్న కారు ఆంధ్రప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఆయనతో పాటు కుటుంబసభ్యులు గాయపడ్డారు. నెల్లూరు జిల్లా అనంతసాగరం మండలం చాపరాళ్లపల్లి సమీపంలోని 565వ నంబర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం చోటుచేసుకుంది.రాజీవ్ హనుమంతు తన కుటుంబసభ్యులతో కలిసి కారులో తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకుని శ్రీశైలం వెళ్తుండగా, మార్గమధ్యంలో వారి కారు ఎదురుగా వచ్చిన ఓ స్కూల్ వ్యాన్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న రాజీవ్ హనుమంతు, ఆయన కుటుంబసభ్యులు గాయపడ్డారు. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, పోలీసులు స్పందించి క్షతగాత్రులను తొలుత ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు.

కొండగట్టులో భారీ కుంభకోణం.. రూ.23 కోట్ల నిధులు గోల్‌మాల్?

కొండగట్టు(ప్రజావినికిడి): :ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి ఆలయంలో కోట్ల రూపాయల నిధులు పక్కదారి పట్టినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దాదాపు రూ.23 కోట్ల మేర అవకతవకలు జరిగినట్లు ఆడిట్ నివేదికలో తేలగా, ఈ వ్యవహారంపై ఏళ్ల తరబడి విచారణ ముందుకు సాగకపోవడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది.2013-14 నుంచి 2017-18 మధ్య కాలంలో జరిగిన ఆడిట్‌లో ఈ భారీ వ్యత్యాసాలు బయటపడ్డాయి. తొలుత రూ.2.26 కోట్లుగా ఉన్న అభ్యంతరాలు, తదుపరి ఆడిట్‌లలో రూ.23 కోట్లకు చేరినట్లు తెలిసింది. హుండీ ద్వారా వచ్చిన డబ్బులు, ఆర్జిత సేవల టికెట్ల ద్వారా వచ్చిన ఆదాయం పూర్తిగా ఖజానాకు జమ కాలేదని, ప్రసాదాల తయారీకి కొనుగోలు చేసిన సరుకుల లెక్కల్లోనూ భారీ తేడాలు ఉన్నాయని ఆడిట్ విభాగం స్పష్టం చేసింది. ఈ నిధుల దుర్వినియోగానికి ఆలయ ఉద్యోగులే బాధ్యులని తేల్చి చెప్పింది.ఈ అక్రమాలపై విచారణ జరపాలని 2022లోనే అప్పటి ఆలయ ఈవో ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో వేములవాడ ఆలయ ఈవోను విచారణాధికారిగా నియమిస్తూ



అదే ఏడాది ఆగస్టులో ఆదేశాలు జారీ అయ్యాయి. 2025లో మరోసారి ఆదేశాలు ఇచ్చినా, విచారణ మాత్రం అంగుళం కూడా ముందుకు కదలలేదు. ఇటీవల విధుల్లో చేరిన ఓ కొత్త ఉద్యోగి ఈ ఫైల్‌ను గుర్తించి మళ్లీ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది.విచారణ నత్తనడకన సాగుతుండగానే, ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగుల్లో కొందరు పదోన్నతులు పొంది ఇతర ఆలయాలకు బదిలీ కావడం గమనార్హం. మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండానే ఉద్యోగ విరమణ పొందారు. దేవాదాయ శాఖలోని కొందరు అధికారులు ఉద్దేశపూర్వకంగానే విచారణను ఆలస్యం చేస్తూ అవినీతిపరులను కాపాడుతున్నారనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి.ఇదిలా ఉండగా, గత ఆగస్టులో ఇదే ఆలయంలో రూ.49.29 లక్షల నిధుల దుర్వినియోగానికి సంబంధించి నలుగురు ఉద్యోగులపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఒకరిని ఉద్యోగం నుంచి తొలగించి, ముగ్గురి ఇంక్రిమెంట్లను నిలిపివేశారు. ప్రస్తుతం ఆలయంలో 60 ఏళ్ల తర్వాత చారిత్రాత్మక చందనోత్సవం నవంబర్ 16 నుంచి జరగనున్న తరుణంలో ఈ భారీ కుంభకోణం మళ్లీ తెరపైకి రావడం చర్చనీయాంశంగా మారింది.

బిగ్ బాస్ వల్ల నాకు ఏం ఉపయోగం లేదు



సినిమా అవకాశాల కోసం ఎన్నో ప్రయత్నాలు.. వ్యక్తిగత జీవితంలో ఒడిదొడుకులు.. ప్రేమలో ఎదురైన చేదు అనుభవాలు.. బిగ్ బాస్ తర్వాత కెరీర్‌లో వచ్చిన మార్పులు.. ఇలా నటి ఇనయా సుల్తానా ఓ ఇంటర్వ్యూలో తన జీవితానికి సంబంధించిన పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. సినీ పరిశ్రమలో అవకాశాల కోసం తాను పడిన కష్టాలను వివరిస్తూనే, తన బ్రేకప్‌కు గల కారణాలను కూడా బయటపెట్టారు. అంతేకాదు, బిగ్ బాస్ షో తర్వాత తన పారితోషికం తగ్గిపోయిందని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఇంతకీ ఇనయా సుల్తానా ఏయే విషయాలను పంచుకున్నారంటే.. సినిమా ఇండస్ట్రీలో అవకాశాలు సంపాదించడం అంత సులభం కాదని ఇనయా సుల్తానా తెలిపారు. అవకాశాల కోసం పలువురిని స్వయంగా కలవాల్సి వచ్చిందని, కొన్నిసార్లు చిన్న చిన్న పాత్రలు చేయడానికి కూడా సిద్ధపడ్డానని గుర్తుచేసుకున్నారు. ఇండస్ట్రీలో మనుషులను హ్యాండిల్ చేయగల సామర్థ్యం తనకు ఉందని, మీడియా కూడా తనకు ఎంతో కొంత అండగా నిలిచిందని చెప్పారు. తన వ్యక్తిగత జీవితం గురించి మాట్లాడుతూ గత ప్రేమ వ్యవహారంపై ఇనయా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు వస్తున్న పేరు, ఫేమ్, సినిమా అవకాశాలను మాజీ ప్రియుడు తట్టుకోలేకపోయేవాడని తెలిపారు. అతడి అసూయే తమ బ్రేకప్‌కు ప్రధాన కారణమని వెల్లడించారు.తన సోషల్ మీడియా ప్రొఫైల్‌లో గతంలో మాదిరిగా ఫొటోషూట్ చిత్రాలు కనిపించవని పేర్కొన్నారు. ప్రస్తుతం తాను చేస్తున్న సినిమా ప్రాజెక్టుల గురించి కూడా బయటకు చెప్పడం లేదని ఇనయా వెల్లడించారు. ప్రాజెక్టుల వివరాలు ముందుగానే పంచుకుంటే దిష్టి తగులుతుందనే భయం ఉందని, అందుకే సినిమాల విషయాలను గోప్యంగా ఉంచుతున్నట్లు తెలిపారు.తదుపరి ప్రాజెక్టుల వివరాలను వెల్లడిస్తాననే సంకేతాలిచ్చారు.

ఆ హీరో మార్కెటింగ్ ప్లాన్ అదిరిపోతుంది



ప్రస్తుత చిత్ర పరిశ్రమలోని ఆర్థిక, క్రియేటివ్ సవాళ్లపై ప్రముఖ దర్శకుడు రామ్ గోపాల్ వర్మ తన విశ్లేషణను ఓ ఇంటర్వ్యూలో వివరించారు. పెద్ద హీరోలు అధిక పారితోషికం తీసుకుంటూ, భారీ బడ్జెట్ చిత్రాలలోనే నటించాలనే ఒత్తిడిని ఎదుం్కొంటు న్నారని ఆర్జీవీ అభిప్రాయపడ్డారు. ప్రేక్షకులు వారి నుంచి అధిక అంచనాలను పెట్టుకోవడం దీనికి కారణం అన్నారు. ఉదాహరణకు, మన ఇండస్ట్రీ పెద్ద హీరోలు 127 అవర్స్ వంటి ప్రయోగాత్మక చిత్రం చేస్తే ప్రేక్షకులు రిసీవ్ చేసుకుంటారా.? అన్నది ప్రశ్నార్థకం. స్టార్‌డమ్ అంటే కేవలం నటుడి స్క్రీన్ ప్రజెన్స్ అని, కథ కంటే కాస్టింగ్ ఫ్యాక్టర్ ముఖ్యమని ఆర్జీవీ పేర్కొన్నారు.బాలీవుడ్ స్టార్ ఆమీర్ ఖాన్ అనుసరించిన వినూత్న మార్కెటింగ్ వ్యూహాన్ని వర్మ ప్రస్తావించారు. ఆమీర్ గజిని వంటి పెద్ద హిట్ తర్వాత, తారే జమీన్ పర్ వంటి చిన్న, ఆర్ట్-హౌస్ సినిమాను తక్కువ బడ్జెట్‌తో నిర్మించి, దానిని గజిని అమ్మిన ధరలో 10వ వంతుకే అమ్మేశారు. ఈ లాజిక్ ప్రకారం, తక్కువ ధరలో అమ్మి, తక్కువ వసూళ్లు వచ్చినా సినిమా విజయం సాధించినట్లు అవుతుంది, దానివల్ల పెట్టుబడిపై రాబడి పెరుగుతుంది. ఇది భారతీయ సినీ పరిశ్రమలో చాలా మంది అనుసరించని లాజిక్ అని ఆర్జీవీ అన్నారు. భారీ బడ్జెట్ కారణంగా రాధే శ్యామ్ వంటి చిత్రాలు ఆశించిన విజయం సాధించలేదని, బాహుబలి మాత్రం నటులు హిందీ ప్రేక్షకులకు తెలియకపోయినా, భారీ విజువల్స్ కారణంగా విజయం సాధించిందని ఆయన తెలిపారు. ఆర్జీవీ తన సొంత చిత్రాలైన శివ, సత్యలను ఉదాహరణగా చూపుతూ, తనకు ఆనందం కలిగించిన కథలనే తక్కువ బడ్జెట్‌తో, వాస్తవిక లొకేషన్లలో, పక్కా ప్లాన్ తో తీశానని వివరించారు.సినిమాకు ఏం అవసరమో దానికే ఖర్చు చేశానని, డబ్బు ఆదా చేయాలనే ఉద్దేశ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. చిత్ర పరిశ్రమలో చాలా మందికి ఆడియన్స్ టేస్ట్ గురించి తక్కువ అవగాహన ఉంటుందని, ఒక సినిమా ఎందుకు హిట్ అవుతుందో లేదా ఫ్లాప్ అవుతుందో అర్థం చేసుకోలేరని ఆర్జీవీ అన్నారు. అలాగే చిల్డ్రన్ ఆఫ్ హెవెన్ అనే ఇరానియన్ చిత్రాన్ని ఇండియాలో తార రం పం పేరుతో రీమేక్ చేసిన విధానాన్ని వివరిస్తూ, అసలు సినిమా వెనుక ఉన్న ఉద్దేశ్యం (“పిల్లల కోసం సినిమా తీయడం”) మారిపోయి, వ్యాపార లాభాల కోసం ప్రయత్నించినప్పుడు ఎలాంటి నష్టాలు సంభవిస్తాయో ఆర్జీవీ ఉదహరించారు. హానెస్టీ అలాగే మెయిన్ పాయింట్ నుంచి డైవర్ట్ అవ్వడం వల్ల చిత్రనిర్మాతలకు నష్టం వాటిల్లుతుందని ఆయన చెప్పారు. విభిన్న చిత్రాలు విజయం సాధిస్తుండటాన్ని బట్టి, ప్రేక్షకులు ఏదైనా చూస్తారని స్పష్టమవుతోందని, కాబట్టి చిత్రనిర్మాతలు తమ సొంత నమ్మకాన్ని అనుసరించడమే సరైన మార్గమని ఆర్జీవీ అన్నారు.

. ఎన్టీఆర్- అనిల్ రావిపూడి క్రేజీ కాంబో.. నవ్వుల విందుకు రంగం సిద్ధం!



టాలీవుడ్‌లో మరో ఆసక్తికరమైన కాంబినేషన్‌కు తెరలేచింది. మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్, సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ అనిల్ రావిపూడి కలిసి ఓ సినిమా చేయబోతుండటంతో అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఇప్పటివరకు ఈ ఇద్దరి కాంబినేషన్‌లో సినిమా రాకపోవడంతో ఈ ప్రాజెక్ట్‌పై సినీ ప్రేక్షకుల్లో అంచనాలు పెరుగుతున్నాయి. తాజాగా ఎన్టీఆర్ ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా వెల్లడించారు. అనిల్ రావిపూడితో కలిసి దిగిన ఫొటోను షేర్ చేస్తూ ‘నవ్వుల విందు సిద్ధమవుతోంది’ అంటూ ఆసక్తికరమైన క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఈ సినిమా పూర్తిస్థాయి ఎంటర్‌టైనర్‌గా ఉండబోతుందనే హింట్ ఇచ్చేశారు. ఈ చిత్రాన్ని ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్‌పై నందమూరి కల్యాణ్‌రామ్ నిర్మించనున్నారు. మరోవైపు అనిల్ రావిపూడి కూడా ఈ కాంబినేషన్‌పై స్పందిస్తూ.. ఎన్టీఆర్‌తో సినిమా చేయాలనే కోరిక ఎప్పటి నుంచో ఉందని తెలిపారు. త్వరలోనే షూటింగ్ ప్రారంభం కానుందనే అర్థం వచ్చేలా సరదాగా అంటూ పోస్ట్ చేశారు.ప్రస్తుతం తారక్ భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ‘డ్రాగన్’ సినిమాపై ఇప్పటికే భారీ అంచనాలు ఉన్నాయి. ఈ చిత్రం పూర్తయిన తర్వాత ఎన్టీఆర్ చేయబోయే సినిమా ఏదనే విషయంపై అభిమానుల్లో ఆసక్తి నెలకొంది. ఈ నేపథ్యంలో అనిల్ రావిపూడితో సినిమా ప్రకటన రావడం అందరినీ ఆశ్చర్యపరిచింది. ప్రశాంత్ నీల్ సినిమాతో యాక్షన్ మోడ్‌లో కనిపించనున్న తారక్.. అనిల్ రావిపూడి దర్శకత్వంలో మాత్రం తనలోని కామెడీ టైమింగ్‌ను మరోసారి చూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో పాటు హీరో ఎలివేషన్స్‌కు కూడా ప్రత్యేక స్థానంచూపించే అవకాశం ఉంది. అనిల్ సినిమాల్లో కామెడీ, ఫ్యామిలీ ఎమోషన్స్‌తో ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎన్టీఆర్‌ను ఆయన ఎలా చూపించబోతున్నారనేది ఆసక్తికరంగా మారింది.ఇదిలా ఉంటే ఇప్పటికే ఎన్టీఆర్, త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఓ భారీ పౌరాణిక నేపథ్య చిత్రం తెరకెక్కనుందనే వార్తలు వచ్చాయి. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులకు సమయం పట్టే అవకాశం ఉండటంతో, ఈలోపు మరో సినిమా చేయాలని ఎన్టీఆర్ నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

బలగం సినిమా ఆడిషన్‌కు వెళ్ళినప్పుడు దిల్ రాజు చెప్పిన మాటకు షాక్ అయ్యా..!



తెలుగు సినీ ప్రేక్షకులకు బాలనటిగా పరిచయమైన కావ్య కళ్యాణరామ్, తన అద్భుతమైన నటనతో ప్రస్తుతం కథానాయికగా దూసుకుపోతున్నారు. ఇటీవల విడుదలైన మసూద అలాగే బలగం వంటి చిత్రాలతో విజయాలను సొంతం చేసుకున్న కావ్య, తన సినీ ప్రయాణం, చిత్రాల ఎంపిక, వ్యక్తిగత విషయాల గురించి ఓ ఇంటర్వ్యూలో అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించారు. చిన్నతనంలోనే సినీరంగ ప్రవేశం చేసిన కావ్య, అప్పటి టాప్ హీరోలతో కలిసి నటించి మంచి గుర్తింపు పొందారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.ఇప్పుడు కూడా క్రేజ్ ఉన్న హీరోలతో పనిచేశారని ఇంటర్వ్యూలో ప్రియదర్శి గుర్తు చేశారు. పెద్దయ్యాక తిరిగి సినిమాల్లోకి రావాలని నిర్ణయించుకున్నప్పుడు, ఆమె మొదట ప్రముఖ దర్శకుడు కె. రాఘవేంద్ర రావు గారిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. ఆయనను గురూజీ అని పిలిచే కావ్య, రాఘవేంద్ర రావు గారు తనకు సొంత మనిషిలా భావించి సినీ రంగం గురించి జాగ్రత్తలు చెప్పారని పేర్కొన్నారు. “ఈ ఫీల్డ్ చాలా కష్టం, చిన్నప్పటిలాగా కాదు. మంచి సినిమాలు చూసి చెయ్యి. పది సినిమాలు చేయనవసరం లేదు, చేసిన ఒకటి, రెండు బాగా చెయ్యి. చదువుకున్నావు, అది వదలద్దు” అని ఆయన ఇచ్చిన సలహా తనకెంతో ముఖ్యమని కావ్య తెలిపారు.మసూద చిత్రాన్ని అంగీకరించడానికి గల కారణాన్ని వివరిస్తూ, కథే తనను ఆకట్టుకుందని కావ్య తెలిపారు. దిల్‌రాజ్ సమర్పణలో స్వధర్మ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ నిర్మించిన ఈ చిత్రంలో, మళ్ళీ రావా మరియు ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ వంటి మంచి సినిమాలు నిర్మించిన వారిపై నమ్మకంతోనే తాను సినిమాను ఒప్పుకున్నానని చెప్పారు.

ఈ వారం థియేటర్లలో 10 కొత్త సినిమాలు



దీపావళి కానుకగా రిలీజైన రామాయణ, సీన్ సినిమాలు సూపర్ హిట్ టాక్ తో రన్ అవుతున్నాయి. అయితే ఈ వారం కూడా భారీగా సినిమాలు థియేటర్లలో సందడి చేయనున్నాయి. ఇట్లు అర్జున, గోట్(+.ా:ూ.ం), భోగి, మాయ లేడీ, డార్క్ చాక్లెట్, దొంగ నా కొడుకు, చంద్రయాన్, జింగో పెన్, అ, టాల్కమ్ పౌడర్.. ఇలా దాదాపు 10 కు పైగా సినిమాలు వెండితెరపై సందడి చేయనున్నాయి. మరోవైపు ఓటీటీలోనూ పెద్ద ఎత్తున సినిమాలు స్ట్రీమింగ్ కు రాబోతున్నాయి. దసరాకు థియేటర్లలో రిలీజైన సినిమాలన్నీ ఈ వారంలోనే ఓటీటీలోకి వచ్చే అవకాశముంది. జైలర్ 2, రణబాలి స్ట్రీమింగ్ డేట్స్ సినిమాల స్ట్రీమింగ్ డేట్స్ ఖరారు కాగా క్రేజీ కల్యాణం కూడా ఈ వీకెండ్ లోనే స్ట్రీమింగ్ కు వచ్చే ఛాన్స్ ఉంది. వీటితో పాటు దాయిరా, వైబ్, పరివారిక్ మనురంజన్ లాంటి డబ్బింగ్ చిత్రాలు.. పుష్పక విమానం అనే తెలుగు సిరీస్ ఉన్నంతలో చూడాలనే ఆసక్తి కలిగిస్తున్నాయి. మరి ఈ వారంలో ఏయే సినిమా ఏయే ఓటీటీలో వస్తుందో తెలుసుకుందాం రండి.నెట్‌ఫ్లిక్స్‌ద గుడ్ లాయర్ (ఫ్రెంచ్ సినిమా) -- నవంబర్ 09ద బాడీ (ఇంగ్లిష్ వెబ్ సిరీస్) -- నవంబర్ 11నెవర్ సరండర్ (ఇండోనేసియన్ సినిమా) -- నవంబర్ 12మిరాకిల్స్ ఆఫ్ ఈఆర్ (కొరియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 12దాయిరా (హిందీ మూవీ) -- నవంబర్ 13రణబాలి (తెలుగు సినిమా) -- నవంబర్ 13హార్ట్ ల్యాండ్ (కెనడియన్ వెబ్ సిరీస్) -- నవంబర్ 13కంక్ ఆన్ సినిమా (ఇంగ్లిష్ మాక్యుమెంటరీ) -- నవంబర్ 15అమెజాన్ ప్రైమ్ వీడియోజైలర్ 2 (తెలుగు డబ్బింగ్ సినిమా) -- నవంబర్ 12వైబ్ (హిందీ చిత్రం) -- నవంబర్ 13జియో హాట్‌స్టార్పుష్పకవిమానం (తెలుగు వెబ్ సిరీస్) -- నవంబర్ 12స్టూడెంట్ ఆఫ్ ద ఇయర్: ఆఫ్టర్ డార్క్ (హిందీ వెబ్ సిరీస్) -- నవంబర్ 13జీ5బ్లైండ్ గేమ్ (హిందీ సినిమా) -- నవంబర్ 11
బాంద్రా (తెలుగు డబ్బింగ్ మూవీ) -- నవంబర్ 13అఫ్రాతఫ్రీ (మరాఠీ చిత్రం) -- నవంబర్ 13మిర్గయ 1.5 (బెంగాలీ) -- నవంబర్ 13

కొన్ని సంవత్సరాలు డిప్రెషన్ లోకి వెళ్లా



నటి బిందు మాధవి తన సినీ ప్రస్థానం, వ్యక్తిగత జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లు, ముఖ్యంగా ప్రేమ విషయంలో డిప్రెషన్‌తో పోరాడిన అనుభవాలు, మరియు తెలుగు చిత్ర పరిశ్రమకు తిరిగి రావాలనే తన ఆశయాలను ఇండియాగ్లిట్జ్ తెలుగుకు ఇచ్చిన ఇంటర్వ్యూలో పంచుకున్నారు. ఆమె వెల్లడించిన విషయాలు సినీ ప్రియులను ఆకట్టుకుంటున్నాయి. మోడల్‌గా తన కెరీర్‌ను ప్రారంభించిన బిందు మాధవి, మొదట చెన్నైకి వెళ్లి మోడలింగ్ చేశారు. ఆ తర్వాత సెగ అనే సినిమా ద్వారా ఆమె సినీ రంగ ప్రవేశం చేశారు.తెలుగులో ఆవకాయ్ బిర్యానీ చిత్రం ఆమెకు ఒక బ్రేక్ అని చెప్పవచ్చు. ఈ సినిమా తర్వాత ఆమె హైదరాబాద్‌కు షిఫ్ట్ అయ్యారు, ఆమె తండ్రి ప్రభుత్వ ఉద్యోగి కావడంతో గుంటూరు, విజయవాడలో పనిచేసేవారు. బిందు మాధవి హైదరాబాద్‌లో స్థిరపడాలని భావించడంతో ఆమె తండ్రి కూడా ట్రాన్స్‌ఫర్ చేయించుకొని వచ్చారు. అయితే, తెలుగులో ఆమె ఆశించిన స్థాయిలో సరైన పాత్రలు లభించలేదు. కేవలం పక్కన నిలబడటం, నవ్వడం, ఒక పాటలో కనిపించడం వంటి పాత్రలే వస్తూ ఉండేవని, వాటి పట్ల తనకు ఆసక్తి లేదని ఆమె స్పష్టం చేశారు. అవకాశాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.అప్పుడు తనకు వచ్చిన అవకాశాలతో తాను సంతృప్తిగా లేనని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆమె తిరిగి చెన్నైకి వెళ్లి అక్కడ ఆడిషన్స్ ఇచ్చి తమిళ చిత్రాలలో అవకాశాలు సంపాదించారు. తమిళంలో తనకు లభించిన పాత్రలతో ఆమె సంతోషంగా ఉన్నానని పేర్కొన్నారు. అయితే, తమిళంలో కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడే ఆమె సుమారు మూడు నుండి నాలుగు సంవత్సరాలు బ్రేక్ తీసుకోవాల్సి వచ్చింది. దీనికి గల కారణాలను వివరిస్తూ, ఆమె వ్యక్తిగత సమస్యల కారణంగా డిప్రెషన్‌తో బాధపడినట్లు తెలిపారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613